కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొన సాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు నగరం లోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ము న్సిపల్ కమిషనర్ సృజనతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేట్ గ్రామంలో చిన్నం చెరువు అలుగు నాలా నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి, దిగువ ప్రాం తాల్లో వరద ముంపు సమస్యను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపా రు. అలాగే ఐజిఆర్ఎస్ నిధులతో మంజూరైన పార్కుల అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని, నియోజకవర్గంలోని అన్ని సర్కిళ్లలో

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, అధికారులు

పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ప్యాచ్‌వర్క్ పనులను వేగం గా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని కూడా సూచించారు.



హైదరాబాద్ వార్త

ఆర్టీసీ సమ్మె ఎఫెక్ట్..

-ఆగిన బస్సు...
కిక్కిరిసిన మెట్రోరైల్
-ప్రైవేట్ వాహనాలల్లో ప్రయాణికులు
-మెట్రో సేవలు పెంచిన యాజమాన్యం
-56 మెట్రోరైళ్లు నడపాలని నిర్ణయం
-ప్రతి 4నిమిషాలకు ఒకట్రైన్..
-రాత్రి 11తర్వాత సైతం నడిపేలా చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:
ఆర్టీసీ జేఏసీ బంద్ తో బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. హైదరాబాద్ సిటీ బస్సులతో సహా సిటీ నుంచి వివిధ జిల్లాకు వెళ్లే బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో నగర వ్యాప్తంగా ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్ సుఖ్ నగర్, ఇతర సిటీ బస్టాండ్లు ప్రయాణికులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రజారవాణాకు ప్రజలు ప్రత్యామ్నాయంగా మెట్రో రైళ్లను ఎంచుకోవడంతో సిటీలో ని మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. అన్ని మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. దిల్‌సుఖ్ నగర్, లక్డీకాపూల్, సికింద్రాబాద్, జేబీఎస్, అమీర్ పేట్, మాదాపూర్ మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిపోయాయి. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతు న్నారు. కొంతమంది ర్యాపిడో, ఊబర్ లాంటి ప్రైవేటు సర్వీసుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా ఆటో డ్రైవర్లు రేట్లు పెంచడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం, ఆర్టీసీ దృష్టిసారించాయి. ఈ నేపథ్యంలో పలు అద్దె బస్సు సర్వీసులను నడిపిస్తోంది. వీటిని నిర్వహించేది ప్రైవేటు డ్రైవర్లే అయినందువల్ల అనుమతి ఇచ్చారు. అయితే కండక్టర్ లేకుండానే ఈ రెంట్ బస్సులు నడిపిస్తున్నాయి. అలాగే ఎంఎంటీఎస్ సర్వీసులతో నిత్యం 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు ప్రజా రవాణా వ్యవస్థపై(ప్రభుత్వ)పై ఆధారపడి ఉండగా ఆర్టీసీలో 26 లక్షలు, ఎంఎంటీఎస్ 60 వేలు, మెట్రో 4.5 లక్షలు, లోకల్, ప్యాసింజర్ రైళ్లలో మిగిలినవారు నిత్యం ప్ర యాణాలు సాగిస్తున్నారు. షేర్ ఆటో, క్యాబ్‌ల్లో ప్రయాణించేవారు మళ్లీ దీనికి అదనం. సమ్మె వల్ల బస్సులు పరిమితంగా నడుపు తుండటం వల్ల మిగిలిన విభాగాల్లో సర్వీసులను మరింత పెంచా ల్సిన అవసరం అనివార్యంగా ఏర్పడింది. ఎంఎంటీఎస్ సర్వీసులు మరిన్ని పెంచినట్లయితే సబ్‌అర్బన్ ప్రయాణాలు కొంత వరకు సాఫీ గా సాగే అవకాశాలు ఉన్నాయి. మేడ్చల్, ఫలక్‌నుమా, చర్లపల్లి, నాంపల్లి, మల్కాజిగిరి, లింగంపల్లి మార్గాల్లో సర్వీసుల సంఖ్య పెంచితే అధికశాతం మంది ప్రజలు వినియోగించుకోవడానికి వీలు ఉంటుంది.

ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మెట్రో...

ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగర వాసుల ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు చేప ట్టింది. ఈ మేరకు మెట్రో రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని మెట్రోరైలు యాజమాన్యం నిర్ణయించింది. ఆర్టీసీ సమ్మె కాలంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎల్ టీఎంఆర్‌హెచ్ 56 మెట్రో సర్వీసు లు నడపాలని నిర్ణయించింది. ఈ మేరకు తమ సర్వీసులను పెంచుతున్నట్లుగా ప్రకటించింది. మియాపూర్-ఎల్బీనగర్ మార్గంలో 4 నిమిషాలకో మెట్రో ట్రైన్ నడుపుతున్నట్లు తెలిపింది. నాగోల్ రాయదుర్గం మార్గంలో 3 నిమిషాల 40 సెకన్లకో మెట్రో ట్రైన్ నడుపుతున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. మియాపూర్ ఎల్బీ నగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్స్‌లో 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్‌పీక్‌లో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు ఉండేది ఇప్పుడు రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడపనున్నారు. నాగోల్ రాయదుర్గ్ కారిడార్‌లో సాధారణం గా నాన్‌పీక్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడిపేవారు ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు నడపను న్నారు. సాధారణంగా వారపు రోజుల్లో ఉదయం 8 నుండి 10:30 వరకు, సాయంత్రం 5 నుండి 8 వరకు మాత్రమే 56 రైళ్లు నడిపే వారు. నాన్‌పీక్ అవర్స్‌లో 44 రైళ్లకు తగ్గించేవారు. సమ్మె కారణం గా ఇప్పుడు ఆ తగ్గింపు ఉండదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులు పొడిగించే అవకాశాన్ని ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్ పరిశీలిస్తోందని ఎండీ తెలిపారు.

బిజెఎస్ వద్ద అందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

దిల్‌షుక్ నగర్ డిపోలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

జైళ్లశాఖ నివృత్తి డీఅడిక్షన్ కేంద్రాలకు డ్రగ్ టెస్టింగ్ కిట్స్ పంపిణీ

ఈగల్ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, జైళ్లశాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర

సైదాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
తెలంగాణ ఈగల్ ఫోర్స్ టీం డైరెక్టర్ సందీప్ శాండిల్య బుధవారం సికాలో జైళ్లశాఖకు చెందిన నివృత్తి డీ అడిక్షన్ కేంద్రాల సిబ్బందితో మత్తు పదార్థాల దుర్వినియోగం, పునరావాసంపై సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నాలుగు సెంట్రల్ జైళ్లు, ఒక మహిళా జైలులో గల అయిదు నివృత్తి డీ అడిక్షన్ కేంద్రాలకు మొత్తం 216 డ్రగ్ టెస్టింగ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ ఖైదీలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడానికి అనుసరించాల్సిన చర్యలు, డ్రగ్స్ దుర్వినియోగానికి సంబంధించి డిపెండెన్స్, టాలరెన్స్, అడిక్షన్‌ల గురించి వివరించారు. కౌన్సిలింగ్, ప్రవర్తనా మార్పు, ధృడ సంకల్పం ద్వారా మత్తు వ్యసనాన్ని అధిగ మించవచ్చన్నారు. జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్ర మాట్లాడుతూ నషా ముక్త భారత్ కార్యక్రమం కింద అన్ని సెంట్రల్ జైళ్లలో, ప్రత్యేక మహిళా జైలులో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. నివృత్తి సంస్థ చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రాజెక్ట్ డైరెక్టర్ సమ్మిత వివరంగా తెలియజేశారు. జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు వల్ల వస్తున్న ఫలితాల అధ్యయనం గురించి వరంగల్ రేంజ్ డిఐజి ఎం.సంపత్ వివరించారు. న్యూజిలాండ్‌లో నిర్వహించిన ఐఆర్‌సిసిలో ఈ అధ్యయనం ప్రదర్శిం చబడినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి ఎన్.మురళిబాబు, డిఐజి ఎం.సంప త్, సంగారెడ్డి సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, మహిళా జైలు సూపరింటెండెంట్ టి.వెంక ట లక్ష్మి, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ జి.ప్రమోద్, సికా ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జిహెచ్ఎంసిలో "బెగ్గర్స్ రిహాబిలిటేషన్ "

-రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, పార్కుల్లో ప్రత్యేక డ్రైవ్

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: 99 డేస్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం జిహెచ్ఎంసి పరిధిలోని 30 సర్కిళ్లలో బెగ్గర్స్ రిహాబిలిటేషన్ కార్యక్రమం నిర్వహించా రు. నగరంలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, ప్రధాన చౌర స్తాలు, దేవాలయ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మొ త్తం 107 మంది యాచకులను గుర్తించగా, అందులో 37 మందిని చౌటుప్పల్ సమీపంలోని అమ్మానాన్న అనాథాశ్ర మానికి తరలించగా..మరో 40 మందిని జిహెచ్ఎంసి పరిధి లోని వివిధ షెల్టర్ హోమ్స్‌లకు తరలించారు. మిగతా వారి ని కౌన్సిలింగ్ చేసి వారి స్వస్థలాలకు పంపించారు. ముఖ్యం గా నాంపల్లి రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, కేబీఆర్ పార్క్, అంబర్‌పేట్ చౌరస్తా, అమీ ర్‌పేట్ చౌరస్తా, బల్కంపేట్ టెంపుల్ పరిసరాలు, నానల్‌నగర్ చౌరస్తా, ఆరాంఘర్ చౌరస్తా ల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నిరాశ్రయుల పునరావాసం, యాచకత్వ నిర్మూలన దిశగా ముఖ్యమైన చర్యలు చేపట్టబడి నట్లు అధికారులు తెలిపారు. ఈ డ్రైవ్‌లో పీఆలు, సీఆలు, ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, శానిటేషన్ సిబ్బంది, ఎన్జీఓలు, ఇతర సంబంధిత విభాగాల సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బెగ్గర్స్‌ను షెల్టర్‌హోమ్స్‌కు తరలిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు, పోలీసులు

స్విమ్మింగ్‌పూల్‌లో పడి బాలుడు దుర్మరణం

మృతి చెందిన బాలుడు రిషాన్‌రెడ్డి.

నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : స్విమ్మింగ్‌పూల్ లో పడిన మూడున్నరేళ్ల బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం... గండిపేట మండలం నా ర్సింగి గ్రామం రాజపుష్ప ప్రొవిన్షియా అపార్ట్‌మెంట్ బ్లాక్-ఎఫ్ 1403ఫ్లాట్‌లో నివసించే మల్లపు దినేష్‌రెడ్డి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతడు ఈ నెల 15.వ,తేదీన వ్యాపారం నిమిత్తం విశాఖపట్నంకు వెళ్లాడు. ఈ నెల 16.వ,తేదీన ఉదయం 11ః30.గంటల ప్రాంతంలో ఆయన భార్య మానస ఫోన్ చేసి కుమారుడు రిషాన్‌రెడ్డి(మూడున్నరేళ్లు) క్లబ్‌హౌస్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో పడిపోయాడని, పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలిపింది. స్థానికుల సహాయంతో బాలుడిని మెడికవర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ పరిస్థితి విష మించడంతో ఈ నెల 17.వ,తేదీన రేయిన్‌బో ఆసుపత్రికి తరలించారు. అక్కడ సై తం బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూ చించారు. 22.వ,తేదీన ఇంటికి తీసుకు వస్తుండగా బాలుడు మృతి చెందాడు. ఈ మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

టవర్‌పైకి ఎక్కి లవర్ హంగామా

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :
తాను ప్రేమించిన ప్రేయసి తనను కాదనడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఏకంగా హైటెన్షన్ టవర్ పైకి ఎక్కి చనిపోతానంటూ మూడు గంటల పాటు హైడ్రామా సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్ వెంచ ర్3 పార్క్ మోతీనగర్ చౌరస్తాలో ఉన్న హైటెన్షన్ టవర్ పైకి బుధవారం ఉద యం 8 గంటలకు సాల్మన్ రాజ్ అనే యువకుడు తన బ్యాగ్ 5 లీటర్ల పెట్రో ల్‌తో టవర్ పైకి ఎక్కి కూర్చున్నాడు. దీంతో ఆ ప్రాంతం అంతా జనం భయంతో గుమిగూడారు. స్థానిక బోరబండ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది టవర్ పై ఉన్న రాజ్‌ను కిందకు దింపేందుకు విశ్వప్రయత్నం చేశారు. అయినా ఆ యువకుడు ఎట్టి పరిస్థితుల్లో కిందకు దిగేందుకు ఇష్టపడకపోవడంతో బోరబండ ఇన్‌స్పెక్టర్ సురేందర్ గౌడ్ ఎంతో చాకచక్యంగా టవర్ పై ఉన్న యువకుడితో ఫోన్‌లో మాట్లాడి సాధ్యమైనంత వరకు అతనిని రక్షించే దిశగా ప్రయత్నించాడు. యువకుడు సాల్మన్ రాజు, నికితలు గత ఏడాది క్రితం నుంచి ప్రేమలో ఉన్నారు. బోరబండ ఎస్ఆర్టీ నగర్‌లో నివసించే నికిత అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో నివసించే సాల్మన్ రాజులు ఒకరిని ఒకరు ప్రేమించుకోగా సంవత్సరం క్రితం సాల్మన్ రాజు ఆ యువతిని పెళ్లి చేసుకుంటానంటూ మాయమాటలతో రాజీవ్‌గాంధీనగర్ పిలిపించుకుని ఆమెపై హత్యాయత్నం చేయడంతో అప్పటి నుంచి దూరంగా ఉంటుం ది. ఆ యువతి గర్భందాల్చటంతో అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో సాల్మన్ రాజుపై కేసు పెట్టడంతో అక్కడ ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చారు. ప్రస్తుతం ఆ యువకుడు తనకు ఆ యువతితో పెళ్లి జరిపించాలంటూ ఏకంగా మోతీనగర్‌లోని హైటెన్షన్ టవర్ పైకి 5 లీటర్ల పెట్రోల్‌తో ఎక్కి హంగామా సృష్టించాడు. పోలీసులు, అగ్నిమా పక సిబ్బంది విశ్వ ప్రయత్నం చేసి యువకుడిని రక్షించే ప్రయత్నం చేశారు. బోరబం డ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేందర్ గౌడ్ ఎంతో చాకచక్యంగా టవర్ పై ఉన్న యువక డిని కిందికి దింపేందుకు ప్రయత్నించగా ఎట్టకేలకు ఆ యువకుడు కిందకు దిగాడు. వెంటనే పోలీసులు ఆ యువకుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆ యువకుడు ఒక స్ట్రిప్పు డోలో మాత్రలను మింగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోతీనగర్ చౌరస్తాలో టవర్ పైకి ఎక్కిన లవర్.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దు

- బక్రీద్ ముందస్తు సమన్వయ సమావేశంలో డిసి రమణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రమణారెడ్డి, చిత్రంలో పలువురు అధికారులు ఉన్నారు.

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పశువుల రవాణా చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జూబ్లీహిల్స్ జోన్ డీసీపీ ఎ. రమణారెడ్డి స్పష్టం చేశారు. మధురానగర్ ఠాణా పరిధిలోని మధురా నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం బక్రీద్ వేడుకలకు సంబం ధించి నిర్వహించిన ముందస్తు సమ్వయ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు, జీహెచ్ఎంసీ, వెటర్నరీ శాఖలు సమ న్వయంతో పనిచేయాలని సూచించారు. మూడు షిఫ్టుల్లో చెక్ పోస్టులు ఉంటాయని, ప్రధానంగా ఉదయం 3 గంటల నుంచి 7 గంటల వరకు పండుగ నేపథ్యంలో నిరంతర నిఘా ఉండాలన్నారు. పండుగ నేపథ్యంలో పారిశుద్యంపై దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ ఇబ్బం దులు కలగకుండా చూడాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, మతసామరస్యాన్ని కాపాడాలని సూచిం చారు. పుకార్ల విషయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించుకో వాలని, అవసరమైతే పోలీసుల దృష్టికి తీసుకు రావాలన్నారు. జంతు సంక్షేమ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీకాంత్, ఏసీపీ సామల వెంకటరెడ్డితోపాటు జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎ. సురేష్, వెటర్నరీ అధికారులు, పోలీసు, రెవెన్యూ శాఖల ప్రతినిధులతోపాటు ఖురేషి సంఘం ప్రతినిధులు, పశువుల రవాణాదారులు, బీఫ్ దుకా ణాల యజమానులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో బురిడీ కొట్టించిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
నకిలీ పత్రాలతో మోసగించి బ్యాంకు రుణం పొందిన ఒక కానిస్టే బుల్‌పై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఎనిమిదో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రెడ్డబోయిన మహేష్ మాసబ్ ట్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు అధికారులు అడిగిన పత్రాలు సమర్పించి రూ. 20లక్షలు రుణం తీసుకొన్నారు. మొదటి రెండు నెలలు ఈఎంఐ చెల్లించినప్పటికి మిగిలిన బాకీ చెల్లించలేదు. ఈ క్రమంలోనే ఆడిటింగ్ చేపట్టిన బ్యాంకు అధికారులకు ఆయన రెండు పాన్‌కార్డులను, నకిలీ పత్రాల ను ఉపయోగించి రుణాన్ని స్వీకరించినట్లు గుర్తించారు. దీంతో బ్యాంకు ఛీఫ్ మేనేజర్ బిపిన్‌కుమార్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. ప్రస్తుతం మహేష్ విధుల్లో ఉన్నాడా లేడా అనే అంశంపై సైతం పోలీసులు విచారిస్తున్నారు.

జంతువులను పరిరక్షించడం మనబాధ్యత : కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణగూడలోని బు ధవారం మేల్కొటే పార్క్ లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ దినం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి లతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూగ జీవుల సంక్షేమం, పరిరక్షణ పట్ల ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇ స్తుందని అన్నారు. జిల్లాలో జంతువులకు వైద్య చికిత్సలు అందించే విధం గా నాలుగు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయని, అట్టి ఆసుపత్రుల ద్వారా మూగ జంతువులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. జంతులను పరిరక్షించడం మన బాధ్యతని తెలుపుతూ ఈ మధ్య పెరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకుని జంతువులపై సమాజంలో అవగాహన పెంచే దిశగా "సేఫ్ విత్ డాగ్స్" అనే కాంపెయిన్ మొదలుపెట్టడం జరిగిందన్నారు. వేసవికాలం దృష్ట్యా జంతువులకై నగరవ్యాప్తంగా 15 వేల నీటి పాత్రలు పెడుతున్నట్లు తెలిపారు. శునకాలతో పాటు గోవులు, పిల్లులు, పక్షులు ఇతర జంతువుల సంక్షేమం పై దృష్టి సా రించాలని సూచించారు. తదుపరి శునకాల ప్రదర్శనను సంబంధిత అధికారు లతో కలిసి కలెక్టర్ తిలకించారు. అనంతరం వెటర్నరీ ఆసుపత్రిని సందర్శిం చి పలు విభాగాలను పరిశీలించి మూగ జంతువులకు మెరుగైన వైద్య సదు పాయాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఏడి డాక్టర్ విద్యా నంద్ గౌడ్, డాక్టర్ సంజీవరావు, ఆర్టీవో పురుషోత్తమ రెడ్డి, జిహెచ్ఎంసి డిడి రామకృష్ణ డీఎస్పీసీఏ సెక్రటరీ రసీల్ ఆల్వాలియా, జంతు ప్రేమికులు పెట్ ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి సమ్మెకు బిసి సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు

ఆర్. కృష్ణయ్యను కలిసిన జెఎసి నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) :
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు చేపట్టిన సమ్మె కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బుధవారం విద్యానగర్ బీసీ భవన్‌లో ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆయనను కలి సి, సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. కార్మికుల డిమాండ్లు అత్యంత న్యాయమై నవని, ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కాలుష్య నివారణ సాకుతో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని కృష్ణయ్య విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి ప్రధాన జిల్లాల్లో వందలాది ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతూ, ఆర్టీసీ డిపోలను మూసివేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 50 లక్షల సబ్సిడీని వాడుకుని ప్రభుత్వమే సొంతంగా బస్సులను కొనుగోలు చేయాలని, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి సంస్థను వెళ్ళనీయవద్దని కోరారు. సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రవాణా నిలిచిపోయి సామాన్య ప్రజలు, ముఖ్యంగా బీద వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వివాహాల సీజన్ కావడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయని, ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని జేఏసీ నాయకులు ఈ సందర్భంగా గుర్తుచే శారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ, 2021 వేతన సవరణ అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతభత్యాలు, రెండేళ్లు గడుస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేరకపోవడం వల్లే విధిలేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు. ప్రైవేటీకరణ వల్ల రూల్ ఆఫ్ రిజర్వేషన్ దెబ్బతిని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఇ. వెంకన్న, థామస్ రెడ్డి, మోలానా, కె. యాదయ్య, ఎస్. సురేష్, బి. యాదగిరి, అనం తయ్య, పర్లగోర్ల మోడీరాందేవ్, రాజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను కలిసిన ఆర్టీసీ జేఏసీ నాయకులు

మానవీయ విలువలకు ప్రాణంపోసిన సహన నాటకం

సహన నాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :
సమాజంలో ఒక ఆడిపిల్ల... ఆడపిల్ల తండ్రి ... మా నవ సంబంధాలను ప్రశ్నించే మానవీయ విలువలకు ప్రాణంపోసిన ఇతివృత్తాంతమే సహన నాటకమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. న్యాయం కోసం నిజాయితీ అన్యాయంపై తిరుగుబాటు చేస్తూ అలసటలేని ప్రయాణం సాగించిన ఒక తండ్రి కూతుళ్ళ కథ అనేకంటే ప్రతినిత్యం ఈ సమాజంలో జరుగుతున్న యదార్థ సంఘటనల నేపథ్యమంటే వాస్తవం సరిపోతుందేమోనని ఆయన అభిప్రాయప డ్డారు. రసరంజని హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే స్నిగ్ధ రచన, ఎన్.రవీంద్రరెడ్డి దర్శ కత్వంలో సమాజాన్ని చైతన్యపరిచే సందేశాత్మకంగా సాగిన సహన నాటకంలో ఆయా పాత్రల్లో రవీంద్ర రెడ్డి, విసిహెచ్‌కె.ప్రసాద్, మీరయ్య, పోతురాజు, లక్ష్మ ణశాస్త్రి, శ్రీలేఖ, కుసుమసాయి అద్భుతంగా నటించి జీవించి ప్రేక్షకులను ఆలోచింపజేశారనడంలో సందే హంలేదు. నాటక ప్రదర్శనాంతరం నటీనటులను, సాంకేతికవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

తీవ్ర గ్యాస్ కొరత..నిద్రావస్థలో కేంద్రం : రవి శేఖర్‌రెడ్డి

క్యూ లైన్లలో ఉన్న కస్టమర్లతో మాట్లాడుతున్న డాక్టర్ రవి శేఖర్ రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్22,ప్రభాతవార్త :
దేశంలో ప్రస్తుత గ్యాస్ సిలిండర్ సరఫరాలో తీవ్ర అంతరాయం డెలివరీకి 3 4 వారాలు పైగా పడుతుండడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ పూర్తిగా నిద్రావస్థలో ఉందని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుధవారం డాక్టర్ రవి శేఖర్ రెడ్డి పలు ఏజెన్సీలలో పర్యటించి ఎర్రగడ్డ డివిజన్ నటరాజ్ నగర్ గ్యాస్ ఏజెన్సీ క్యూ లైన్లు మరియు గోడౌన్ వద్ద ఉన్న కస్టమర్లతో మాట్లాడారు. కొన్ని లక్షల సిలిండర్లు డెలివరీ లో పెండింగ్ లో ఉన్నాయని హోటళ్లు,రెస్టారెంట్ లు క్యాంటీన్లు వాణిజ్య గ్యాస్ కొరతతో మూతపడ్డాయని, గృహోపకరం ఐన గ్యాస్ 34 వారాలు పడుతుండడం ప్రజలు పడుతున్న తీవ్రమైన ఇబ్బందులను గుర్తించి ఇకనైనా కేంద్ర ప్రభుత్వం దిగుమతులను పెంచడానికి మరియు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని డాక్టర్ రవి శేఖర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెరగాలి : ప్రొఫెసర్ లింబాద్రి

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్య మండలి పూర్వ చైర్మన్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ లింబాద్రి

చిక్కడపల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) : విద్యార్థుల్లో రాజ్యాంగ అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి పూర్వ చైర్మన్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ లింబాద్రి అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ లా కాలేజీలో"కాకా ఏఎల్‌సి న్యాయ ఉత్సవ్ 2026 వేడుకలను నిర్వహించారు. స్టూడెంట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో"అంబేద్కర్ బ్లూప్రింట్: ఎ లెగసీ దట్ లివ్డ్ ఆన్ అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమాన్ని డీఆర్ బీఆర్ఏఈఐ సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సృజనతో కలిసి ప్రారంభించారు. కళాశాలలోని మూట్ కోర్ట్ హాల్‌లో నిర్వహించిన "లెక్స్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ న్యాయపరమైన అంశాలు, సామాజిక సమస్యలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు అందరినీ ఆలోచింపజేశాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, న్యాయం కలిగిన సమాజ నిర్మాణంలో భావి న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

డిఆర్ఎస్ సిబిఎస్ఈ 10వ తరగతి టాపర్ల సన్మానం

టాపర్‌లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఐ.వేణుగోపాల్

హైదరాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:
విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా, భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించాలని డి.ఆర్.ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ. వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుండ్ల పోచంపల్లి లో డి.ఆర్.ఎస్.ఐ.ఎస్ క్యాంపస్‌లో బుధవారం డి.ఆర్.ఎస్ సిబిఎస్ఈ 10వ తరగతి టాపర్ల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా డి.ఆర్.ఎస్ సిబిఎస్ఈ 10వ తరగతిలో బి. జతిన్‌రెడ్డి 98.4 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. సబ్జెక్టు టాపర్‌గా ఎస్. నైనిక 97.6 మార్కులతో రెండవ టాపర్‌గా నిలిచారు. 95.4 మార్కులతో సంయుక్తంగా మూడవ టాపర్ స్థానాన్ని సాధించిన కె. హిమానీష్, కెల్విన టి, గణితశాస్త్రంలో 95 మార్కులతో సబ్జెక్ట్ టాపర్‌గా నిలిచినా అక్షాంత్ కె, ఐటీలో వందకు వంద మార్కులు సాధించిన బి. వెంకట కృష్ణ, ఎ. దీత్య రెడ్డిలను స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఐ. వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులను వారి అద్భుతమైన విజయానికి అభినందించి, భవిష్యత్తులో వారి విద్యాభ్యాసంలో మరింత కష్టపడి పనిచేయాలని ప్రోత్సహించారు. విద్య తోపాటు స్కిల్, సెల్ఫ్ డెవలప్మెంట్ నేర్చుకొని దేశానికి బాధ్యతాయుతమైన, ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగడానికి కృషి చేయాలని ఆయన సలహా ఇచ్చారు.కార్యక్రమంలో డి.ఆర్.ఎస్.ఐ.ఎస్ సీబీఎస్ఈ కో ఆర్డినేటర్ మేరీ తనూజ, హెచ్.ఓ.డి బోర్డింగ్ రాజేందర్ ప్రసాద్,టీచర్స్‌లు పాల్గొన్నారు.

త్వరగా సిసి రోడ్డు పనులు పూర్తి చేయాలి

గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



వివేక్ నగర్ ప్రాంతంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

చిక్కడపల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త)
గాంధీనగర్ డివిజన్ పరిధిలోని వివేక్ నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ. పావని వినయ్ కుమార్ బుధవారం పరిశీలించారు. చిక్కడపల్లి వివేక్ నగర్ సమీపంలోని పెండగంటి లా కాలేజీ, ఆంధ్ర విద్యాలయ పాఠశాల వద్ద గతంలో రూ. 12 లక్షల కార్పొరేటర్ నిధులతో ప్రారంభించిన ఈ పనుల పురోగతిని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ కార్పొరేటర్ ఫండ్స్ (రూ. 1 కోటి)లో భాగంగా ఈ నిధులను కేటాయించినట్లు తెలిపారు. పనుల జాప్యం వల్ల స్థానిక వ్యాపారులు, పాదచారులు , వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బుధవారం రాత్రి నుండే పనులు ముమ్మరం చేసి, మరో 15 రోజుల్లో నూతన రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆమె వెల్లడించారు.ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో నాణ్యతను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, పి. నర్సింగ్ రావు, ఆనంద్ రావు, సాయి కుమార్, సత్యేంధర్, ప్రశాంత్ మరియు స్థానికులు శాలిని, తులసి, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం

-అంబేద్కర్ వర్సిటీలో ఉన్నత విద్యలో డిజిటల్ పరివర్తనపై సదస్సు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాశ్, చిత్రంలో ఆచార్య ఘంటా చక్రపాణి ఉన్నారు.

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
విశ్వవిద్యాలయాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బుధవారం ఉన్నత విద్యలో డిజిటల్ పరివర్తన అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా క్రెడిట్ ఆధారిత ఆన్‌లైన్ కోర్సుల కోసం స్వయం వేదికను ఏర్పాటు చేశారని, ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాలు సొంతంగా పూర్తి ఆన్‌లైన్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారని, అదేవిధంగా యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండే లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా విద్యార్థులకు విద్యను అందించడానికి సంపూర్ణ అధ్యయన వేదికలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ విద్య, సంస్థాగత కార్యకలాపాలు, విద్యా బోధన, విద్యార్థుల అనుభవాలు, సంస్థల అభివృద్ధిని సమూలంగా పునర్వ్యవస్థీకరించాలన్నారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమగ్రమైన, వ్యూహాత్మక మార్పులను మార్చే దిశగా ఎల్లప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అవసరమని ఉందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ ఆచార్య పుష్పా చక్రపాణి, ఆచార్య రబీంద్రనాథ్ సోలమన్, ఆచార్య పి. వెంకట రమణ, ఆచార్య బి. శ్రీనివాస్, ఆచార్య ఎన్. రజని, ఆచార్య కె. శ్రీదేవి, ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఆచార్య ప్రమీలా కేతావత్, ఆచార్య జి.దయాకర్, డాక్టర్ వై వెంకటేశ్వర్లు, ఆచార్య ఎస్.వీ. రాజశేఖర్ రెడ్డి అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు ఉద్యోగ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

రూ.8వేల కోట్ల ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలి

-బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్

ర్యాలీలో ప్రసంగిస్తున్న కన్వీనర్ మోదీ రాందేవ్, భీంరాజ్ తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త:
విద్యార్థులకు రావలసిన 8 వేల కోట్ల ఫీజుల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని అలాగే ఆత్మహత్య చేసుకున్న విద్యార్థికి 2కోట్లు నష్టపరిహారం చెల్లించాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ అన్నారు.బుధవారం విద్యానగర్‌లో తెలంగాణా బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా మోదీరాందేవ్ మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటుంటే ముఖ్యమంత్రి లక్షల కోట్ల కుంభకోణాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని బీసీ, ఎస్సీ,ఎస్టీలు చదువుకుంటుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓర్వలేకపోతుందని విమర్శించారు. ఫీజులు బకాయిలు ఇవ్వకపోతే "రేవంత్ హటావో తెలంగాణకు బచావో" ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.నిరుపేద విద్యార్థులు చదువుకోడానికి స్కాలర్షిప్ అనే గొప్ప పథకాన్ని ఆర్ కృష్ణన్న అమర నిరాహార దీక్ష చేసి పెట్టిస్తే ఈ ప్రభుత్వం స్కీమును ఎత్తేయలని కుట్రలు చేస్తుందన్నారు. డైరెక్ట్‌గా ఎత్తివేస్తే చెడ్డపేరు వస్తుందని, ధైర్యంగా పరోక్షంగా కోర్టు ద్వారా విద్యార్థుల వద్ద వసూలు చేయాలని తీర్పు తెస్తున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రి నియమించిని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన విధంగా విద్యార్థులు రావాల్సిన మొత్తం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి, విద్యా భరోసాకార్డు, నిరుద్యోగ భృతి 4000 ఇవ్వాలని లేనిపక్షంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

బక్రీదు సందర్భంగా పోలీసులకు సహకరించాలి : డిసిపి శ్రీనివాస్

బక్రీదు సమయంలో పాటించవలసిన విషయాలను వివరిస్తున్న డీసీపీ శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : రానున్న బక్రీదు పండుగను శాంతియుత వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్.శ్రీనివాస్ కోరారు. చాంద్రాయణగుట్ట డివిజన్ పరిధిలోని ఇమామ్లు, ఖురేషీలు, మతపెద్దలు, వ్యాపారులతో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రానున్న మే 27వ తేదీన బక్రీదు పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులతో సహకరించాలన్నారు. గత సంవత్సరం మైలార్‌దేవ్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన సంఘటనల నేపథ్యంలో జంతువుల తరలింపులో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఖుర్బానీ కోసం జంతువులను తరలించే సమయంలో ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిషేధిత జంతువులను తరలించవద్దన్నారు. బహిరంగ ప్రదేశాలలో జంతువులను ఖుర్బానీ ఇవ్వవద్దని, ఇళ్లలో, ప్రత్యేక వధశాలలో మాత్రమే నిర్వహించుకోవాలన్నారు. జంతు వ్యవర్థాలను ప్రత్యేక కవర్లలో వేసి జీహెచ్ఎంసి వాహనాలకు అందజేయాలని, ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దన్నారు. సామాజిక మాధ్యమాలను తక్కువగా వినియోగించాలని తెలిపారు. జంతువుల ఖుర్బానీ ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమంలో పోస్టు చేయవద్దని హితవు పలికారు. తద్వారా శాంతిభద్రల సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. చట్ట ప్రకారం నడుచుకునే వారికి పోలీసుల సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డివిజన్ ఏసీపీ ఎ.సుధాకర్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపి, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ జె.బాలరాజు, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లికార్జున్ ఖర్గే క్షమాపణాలు చెప్పాలి

అత్తాపూర్ ఏప్రిల్ 22,ప్రభాతవార్త : ప్రధాని నరేంద్ర మోడీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే మల్లికార్జున్ ఖర్గే క్షమాపణాలు చెప్పాలని పలువురు బిజెపి నేతలు డిమాండ్ చేశారు.ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలను ఖండిస్తూ బిజెపి రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉప్పరపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా పలువురు బిజెపి నేతలు మాట్లాడుతూ... తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ టెర్రరిస్టుగా వర్ణించి ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.వెంటనే మల్లికార్జున ఖర్గే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ కోసమే జిల్లా ఇన్చార్జ్ వైస్ శ్రీధర్ నారాయణ ఖేడ్ జిల్లా ఇన్చార్జి బాల్ రెడ్డి,మహిళా మోర్చా వనిత రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, రజనీకాంత్ గుప్తా, తిరుమలేష్, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సరిత రెడ్డి, అంబికా, రాకేష్ గౌడ్, పద్మావతి, జంగయ్య, జ్ఞానేశ్వర్, ప్రకాష్ రెడ్డి,స్వామి, విజయ్ యాదవ్,భూపాల్ ముదిరాజ్, ప్రవీణ్, బాల సాయి, నరేందర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అఖిలభారత " వడ్డెర సమ్మేళనం"

సమ్మేళనంలో మాట్లాడుతున్న సంఘం నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వడ్డెర సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. యువజన సంఘం నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ లోకేష్ వేముల ఆధ్వర్యంలో నిర్వహించగాసభాధ్యక్షుడిగారాష్ట్ర అధ్యక్షుడు దండుగుల మైసయ్య వ్యవహరించారు. వైస్ ప్రెసిడెంట్ మంజుల హనుమయ్య, మేడ్చల్ జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు పి గోపాల్ సమన్వయం చేశారు. ఈసందర్భంగా వడ్డెరుల సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. ఈసందర్భంగా కుత్బుల్లాపూర్ నియజకవర్గం గాజులరామారం డివిజన్‌లో పదవులు అప్పజెప్పారు. ఈకార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మణ్, వేముల తిరుమల దేవి, నేషనల్ సెక్రటరీ ఎం శేఖర్ . నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వరికుప్పల శ్రీనివాస్, లాయర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేముల శ్రీనివాస్, రాష్ట్ర సెక్రటరీలు గోగుల స్వామి, ఆలకుంట్ల రాజమ్మ తదిరులు హాజరయ్యారు.

నిబంధనలకు తూట్లు.. హైబీమ్ లైట్లు

- 176 కేసులు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
జిగేల్ మంటూ ఎల్ఈడీ లైట్లు పెట్టి ప్రయాణిస్తున్న వాహనదారులపై జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా 176 కేసులు నమోదు చేయడమే కాకుండా మూడు వాహనాలను సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ డీసిపి కాజల్ సింగ్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్దంగా చాలా మంది వాహనదారులు కంపెనీతో వచ్చిన లైట్లను కాకుండా హైబీమ్(ఎక్కువ కాంతి) ఉన్న లైట్లను మారుస్తున్నారని, అంతేకాకుండా వాహనం చుట్టూ జిగేల్ మంటూ లైట్లు ఏర్పాటుచేస్తున్నారన్నారు. దీనివల్ల ఎదుటి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో గత మూడు, నాలుగు రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నిబంధనలకు విరుద్దంగా వాహనం చుట్టూ జిగేల్ మంటూ లైట్లు ఏర్పాటుచేసుకొని ప్రయాణిస్తున్న ఒక కారుతోపాటు మరో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో ఒకటి, ఎస్సార్‌నగర్ ఠాణా పరిధిలో రెండు వాహనాలను స్వాధీనం చేసుకొన్నామన్నారు. ఇప్పటివరకు మొత్తం 176 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. వాహనదారులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆమె స్పష్టం చేశారు.

రాంనగర్ గుండు వద్ద ఖర్గే దిష్టిబొమ్మ దహనం



అడిక్‌మెట్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు బస్టాప్ వద్ద ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేసిన దృశ్యం

చిక్కడపల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం అడిక్ మెట్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు బస్టాప్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకుఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. దేశ ప్రధానిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఖర్గే వెంటనే మోదీకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యకర్తలు శేష సాయి, జనార్దన్ రెడ్డి, రాజకుమార్, కౌండిన్య ప్రసాద్, కిషోర్, నరేష్, శ్యామ్, చంద్రశేఖర్, వంశి, మాధవి, శివ, శోభ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలను ప్రతిబింబించేలా రచనలు చేయాలి

-తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గోపి

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్.గోపి

చిక్కడపల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) : సమాజంలోని మానవీయ విలువలను ప్రతిబింబించేలా రచనలు చేయాలని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ఎన్. గోపి అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయణ గానసభలోని కళా లలిత కళావేదికలో సాధన సాహితి స్రవంతి అధినేత సాధన నరసింహా చార్య , త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ వై. రామకృష్ణ రావు రచించిన మనలో మాట గ్రంథావిష్కరణ సభ విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ డి.చక్రపాణి అధ్యక్షతన జరిగింది. గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆచార్య ఎన్.గోపి మాట్లాడుతూ మనలో మాట" గ్రంథం సమాజంలోని మానవీయ విలువలను ప్రతిబింబించేలా ఉండి, పాఠకులను ఆలోచింపజేసే విధంగా రచయిత తన భావాలను సులభంగా వ్యక్తపరిచారని అన్నారు. తెలుగు సాహిత్యంలో ఇటువంటి రచనలు మరింత అవసరమని అభిప్రాయపడ్డారు. అధ్యక్షత వహించిన డాక్టర్ చక్రపాణి మాట్లాడుతూ రచయిత సమాజ సమస్యలను లోతుగా అర్థం చేసుకుని వాటిని సాహిత్య రూపంలో అందించడం అభినందనీయం అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి, ప్రముఖ కవి సుధామ,ప్రముఖ సాహితీవేత్త పోతూరి సుబ్బారావు, అంబేడ్కర్ వర్శిటీ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పి. శేషగిరి రావు, నిర్వాహకసంస్థ అధినేత సాధన నరసింహ చార్య పాల్గొనగా రచయిత డా. వై. రామకృష్ణ రావు తన స్పందన తెలిపారు.

మండుతున్న ఎండలు.. పాతబస్తీలో కనబడని చలి వేంద్రాలు

ఎండ తలగకుండ తలకు టోపీలు ధరించిన యువకులు

చార్మినార్,ఏప్రిల్ 22 ప్రభాతవార్త :
ఎండలు రోజు రోజుకు పెరుగుతుండటంతో భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక ప్రజలు విలవిల లాడిపోతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో పాటు వేడి గాలులు వీస్తున్నందున చిన్న పిల్లలు,వృద్ధులు,రోగులు ఇండ్లకు మాత్రమే పరిమితమవుతున్నారు.ఎండ కాలంలో పాతబస్తీలోనిపలు ప్రాంతాలలో స్వచ్ఛంధ సంస్థలు చలి వేంద్రాలు ఏర్పాటు చేసేవారు.ప్రస్తుతం పాతనగరంలో చలి వేంద్రాలు ఎక్కడ కనబడటం లేదు.రాత్రి వేళల్లో ఉక్క పోత ఎక్కువగా ఉన్నందున మధుమేహం,బిపి,గుండె వ్యాధులతో బాధపడుతున్న రోగులు భయ పడుతున్నారు.శాలిబండ బస్టాప్‌లో బస్ షెల్టర్ లేనందున ప్రజలు ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. తలకు వేడి తగల కుండ యువకులు టోఫీలు ధరిస్తున్నారు. వృద్ధులు,మహిళలు గొడుగులు పట్టుకుని మార్కెట్లకు వెళుతున్నారు.నిత్యం రద్దీగా ఉంటే చార్మినార్,మదీనా చౌరస్తా, శాలిబండ,వస్త్రాల మార్కెట్లు,లాడ్‌బజార్ గాజుల షాపులు సాయంత్రం ఐదు గంటలు వరకు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.ఎండలు కారణంగా చార్మినార్,సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్,జూపార్కును తిలకించటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గి పోయింది. చార్మినార్,మహ్మద్ క్యాప్ మార్ట్,దివాన్‌దేవిడి షాపులలో జోరుగా టోఫీల అమ్మకాలు జరుగుతున్నాయి.చిన్న పిల్లలు,వృద్ధులు ,రోగులు వడ దెబ్బ తగలకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితులలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని,ఎక్కువగా నీరు తీసుకోవాలని,మజ్జిగ,కొబ్బరి నీళ్ళ, నిమ్మ రసం త్రాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఏపి మాజీ సిఎం జగన్‌తో బిఆర్ఎస్ నేత రవీందర్‌యాదవ్ బేటి



జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ నేత రవీందర్‌యాదవ్

శేరిలింగంపల్లి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త
ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, శేరిలింగంపల్లి ఉద్యమ నేత చిర్రా రవీందర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్ఆర్ కడప జిల్లాలోని పులివెందులలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా సమావేశయ్యారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వైఎస్ఆర్ చిత్రపటాన్ని అందించారు. ఫోటో ఫ్రేమ్‌ను చూసి చాలా బాగుందని కితాబిచ్చారు. అనంతరం చిర్రా రవీందర్‌యాదవ్ యోగ క్షేమాలు అడిగితెలుసుకున్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. అలాగే తన సొంత ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానం బాగుందని ప్రశంసలు కురిపించారు. మరోవైపు చిర్రా రవీందర్‌యాదవ్ శేరిలింగంపల్లి నుంచి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తుండటంతో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ సందర్భంగా తన మద్దతు ఉంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని సూచించారని తెలిపారు. పోటికి సిద్దంగా ఉండాలని వైఎస్ జగన్ తెలిపారని పేర్కొన్నారు. ఇరువురి మధ్య కొద్దిసేపు ఆత్మీయ సమావేశం కొనసాగగా, పలు కీలక అంశాలు చర్చించారు. అనంతరం చిర్రా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ..రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో కేసీఆర్,ఏపీలో వైఎస్ జగన్ అధికారంలోనికి రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో రానున్న ఎన్నికల్లో విప్లవాత్మక మార్పులు జరుగనున్నట్లు ఆయన వెల్లడించారు.

గుల్‌మోహర్‌పార్క్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

శేరిలింగంపల్లి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : గుల్‌మోహర్‌పార్క్ కాలనీని సుందరంగా రూపొందించటంతో పాటు సమస్యలులేని కాలనీగా మార్చటమే ధ్యేయంగా కృషిచేస్తున్నట్లు కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని గుల్‌మోహర్‌పార్క్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. 2026-2028 రెండేళ్లకుగాను నూతన పాలక వర్గం ఎన్నికల ప్రక్రియ ఎన్నికల అధికారులు డాక్టర్ సునిల్ సింగ్,సిహెచ్ కుమార్, దేవికాల సమక్షంలో జరిగింది. కాలనీ నూతన అధ్యక్షుడిగా షేక్ ఖాసీం, ఉపాధ్యక్షుడిగా యం.మోహన్‌రావు,ప్రధాన కార్యదర్శిగా టి. వెంకటేశ్వర్లు,జాయింట్ శెక్రటరీగా ఏఎస్ఎస్ శంకర్‌రావు, ఆర్గనైజింగ్ శెక్రటరీగా పి.లక్ష్మీ,కోశాధికారిగా బి.హెచ్ కిశోర్‌బాబు,జాయింట్ ట్రెజరర్‌గా జే.దుర్గ ప్రసాద్,ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా సమీర్ పటేల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ ఖాసీం మాట్లాడుతూ. గుల్‌మోహర్ పార్క్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా మరోసారి తనను ఎన్నుకున్న కాలనీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో నెలకున్న సమస్యలను స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా విద్యార్థుల ర్యాలీ



వరల్డ్ ఎర్త్ డే ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :
'వరల్డ్ ఎర్త్ డే' ను పురస్కరించుకొని గౌలిపురా అయోధ్య నగర్ కాలనీలోని జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్జీఓలు కలిసి ర్యాలీ నిర్వహించారు. జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ ముఖ్యఅ తిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో భూమిని కాపాడుకుందాం..భవిష్యత్‌ను రక్షిద్దాం అన్న నినాదాలు, ప్లకార్డులను ప్రదర్శించి స్థానికులలో చైతన్య కల్పించారు. ఈ సందర్భంగా ధర్మేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించి, ఇంటికో మొక్కను నాటాలని కోరారు. అనంతరం పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయురాలు లక్ష్మీ నాగకుమారి, ఎన్జీఓ కార్యదర్శి రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో రౌడీషీటర్ హల్‌చల్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
బంజారాహిల్స్‌లో మంగళవారం రాత్రి ఒక రౌడీషీటర్ హల్‌చల్ చేసి దోపిడి చేసిన ఘటన ఇది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మోహన్ జీవనోపాధి కోసం నగరాని వచ్చి తన సోదరుడు కిషోర్‌తో కలిసి బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో నివసిస్తున్నాడు. ఏప్రిల్ 21న ఐస్‌క్రీమ్‌లు అమ్ముకొని తిరిగి వెళ్తున్న క్రమంలో రోడ్ నంబరు 13లో కట్టమైసమ్మ దేవాలయం వద్ద అదే ప్రాంతానికి చెందిన షోయబ్ అనే రౌడీషీటర్ అతన్ని అడ్డగించాడు. ఐస్‌క్రీం తీసుకొన్నాడు. తీసుకున్న ఐస్‌క్రీమ్‌కు డబ్బులు అడిగాడన్న అక్కసుతో దూషించడమే కాకుండా దాడికి పాల్పడ్డాడు. మోహన్ జేబులో ఉన్న రూ. 2280 డబ్బులను బలవంతంగా లాక్కొన్నాడు. ఈ సంఘటనపై మోహన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లంటూ మోసం.. అడిగినందుకు దాడి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
పెళ్లంటూ మోసగించడమే కాకుండా ఒక యువతిపై దాడికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రాజుసింగ్ సర్వాల్ అనే వ్యక్తికి 2003లో పాఠశాలలో చదువుతున్న సమయంలో తోటి విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఇంటర్‌లో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ప్రేమ సంబంధం కొనసాగించాడు. విద్యార్థిని కుటుంబం మరో ప్రాంతానికి వెళ్లినప్పటికి ఆమె వెంట పడ్డాడు. అనంతరం అకస్మాత్తుగా దూరమైన రాజుసింగ్ తిరిగి 2007లో మళ్లీ ఆ యువతికి దగ్గరయ్యాడు. ఉద్యోగ కారణాల వల్ల దూరంగా ఉన్నానని నమ్మించి ఆమెతో సన్నిహిత సంబంధం కొనసాగించడు. ఆమెతో సంబంధం ఉండగానే 2010లో మరో మహిళను వివాహం చేసుకున్నాడు. అనంతరం యువతి పనిచేసే ప్రాంతానికి వెళ్లి వేధించడం, అవమానించడం కొనసాగించాడు. తన భార్యతో విడాకులు తీసుకుంటానని నమ్మించి తిరిగి ఆ యువతికి దగ్గరయ్యాడు. దీనికితోడు ఆమె ఫోటోలు, వీడియోలు ఉపయోగించి బెదిరింపులకు పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం యువతిపై ఇనుప రాడ్డుతో దాడికి పాల్పడటమే కాకుండా జుట్టు పట్టుక్కొని చితక్కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. గతంలోనూ ఇలానే పలుమార్లు దాడులకు పాల్పడ్డాడు. ఈ సంఘటనలపై యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు రాజుసింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటిఎం కేంద్రాల వద్ద దృష్టి మరల్చే నిందితుల అరెస్ట్

నిందితుడు మహమ్మద్ మొక్తదార్ రహమాన్ ఉర్ | నిందితుడు షేక్ అకెపుద్దీన్ షరీఫ్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 22, ప్రభాతవార్తః
ఏటీఎంల వద్ద దృష్టి మరల్చి డబ్బులు కాజేసే ఇద్దరు నిందితులను ఫిల్మ్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఏటీఎం కేంద్రాల వద్ద కాపు కాసే ఇద్దరు అగంతకులు కేంద్రానికి వచ్చే అమాయకులను లక్ష్యంగా చేసుకొని తాము గూగూల్ పే లేదా ఫోన్ పే నుంచి డబ్బులు చెల్లిస్తామని, నగదు ఇవ్వాలంటూ నమ్మిస్తారు. నకిలీ పేమెంట్ స్క్రీన్‌షాట్లతో అవతలి వారిని నమ్మించి డబ్బు తీసుకొని పరారవుతారు. ఇలా తాజాగా ఏటిఎం కేంద్రం వద్ద రూ. 20వేలు మోసం చేసి తీసుకున్నారు. గతంలోనే రెండు సంఘటనల్లో ఇద్దరిని మోసం చేసి ఇలానే డబ్బులతో ఉడాయించారు. ఈ క్రమంలోనే విచారణ చేపట్టిన ఫిల్మ్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాలు, ఫోన్ డాటా ఆధారంగా నిందితులను గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బండ్లగూడ ప్రాంతానికి చెందిన రాపిడో డ్రైవర్ మహమ్మద్ మొక్తదార్ రహమాన్ ఉర్ అలియాస్ ఆయాన్(23), అతని స్నేహితుడైన ఏసీ మెకానిక్ పహడీషరీఫ్‌కు చెందిన షేక్ అకెపుద్దీన్ షరీఫ్(22)లు ఉన్నారన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిచారు.

మాదాపూర్‌ప్రాంతంలోని పేవ్‌మెంట్‌పై నెలకొల్పిన బస్‌షెల్టర్‌లోనే వంటచేసుకుంటూ అక్కడే నివసిస్తున్న చిరువ్యాపారులు...దీనితో బస్సులకోసం వచ్చే ప్రయాణీకులకు వేసవి భుక్తాయాసం తప్పడంలేదు.

ఆదిత్యనగర్‌లో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు

అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 22,ప్రభాతవార్త :

ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని ఆదిత్యనగర్ సెక్టార్‌లో గల మక్త మహబూబ్ పేట్ అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ్ అభియాన్ కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సామూహిక శ్రీమంతాలు, అన్నప్రాసన, సుపోషణ, అక్షరాభ్యాసం, ఆరోగ్య దివస్ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ జిల్లా మహిళా అభివృద్ధి అధికారి శ్రీలత, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కవిత, సూపర్‌వైజర్లు స్వాతి, మాధురి, అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకున్న పిల్లలను తరువాత తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గర్భిణీ స్త్రీలు తల్లి కడుపుతో ఉన్నప్పటి నుంచే సమతుల్య ఆహారం, పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకుంటే పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని వివరించారు. అలాగే 7 నెలల వయస్సు నుండి పిల్లలకు బాలామృతం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, తల్లులు, చిన్నారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నల్లపోచమ్మ,తుల్జాభవాని దేవాలయం వార్షిక మహోత్సవం

శ్రీనల్లపోచమ్మ,తుల్జాభవాని అమ్మవార్లకు పూజలు నిర్వహించిన కార్పొరేటర్ బోహిని దర్శన్,ఆలయకమిటీ సభ్యులు.

కార్వాన్ ఏప్రిల్ 22,ప్రభాతవార్త

జియాగూడ డివిజన్ సంజయ్ నగర్ లోని 2 బి.హెచ్.కె. ప్రాంతంలో గల శ్రీనల్లపోచమ్మ తుల్జా భవాని దేవాలయము వార్షిక మహోత్సవ వేడుకలు స్వస్తిశ్రీచాంద్రమానేన శ్రీవిశ్వావసు నామ సంవత్సర వైశాఖ శుద్ధ షష్టిసప్తమిఅష్టమి 22 నుండి 24 వరకు త్రయాన్నిక దీక్షా కార్యక్రమాలు జరుగునని దేవాలయ కమిటి సభ్యులు తెలిపారు.మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం గణపతి పూజ,పుణ్యవచనం, రక్షాబంధనం, దీక్షాదారణ, అంకురారోపణ,మండపారాదన,సాయంత్రం హోమగుండ ప్రవేశం ,గణపతి,లక్ష్మి గణపతి,నవగ్రహ,దుర్గా హోమాలు,జయాది హోమాలు,నీరాజన మంత్రపుష్పాములు,తీర్థప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జియాగూడ డివిజన్ కార్పొరేటర్ బోహిని దర్శన్ పాల్గొని పూజలు నిర్వహించారు.ఆలయకమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా సత్కరించింది.పరిసర ప్రాంతాల భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారి కృపకు పాత్రులు కాగలరని మనవి చేసారు.

నాలా రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచాలి

-బోయిన్‌పల్లి డిసి ధాకునాయక్‌కు గౌరపల్లి రమేష్ వినతి

డీసీ ధాకు నాయకు వినతి పత్రం అందిస్తున్న గౌరపల్లి.

బేగంపేట ఏప్రిల్ 21,ప్రభాతవార్త

బేగంపేట అల్లంతోటబాయిలో సప్తగిరి టవర్స్‌వైపు నుంచి వచ్చే నాలా రిటైనింగ్ వాల్ ఎత్తు పెంచాలని,మయూరి మార్గ్‌లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని,గుంతలు పడిన రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయాలని కోరుతూ ప్రకాశం నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్ మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పోరేషన్ బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ధాకు నాయక్ కు వినతి పత్రం అందజేసారు.అల్లంతోట బాయి,మయూరిమార్గ్‌లలో రోడ్లపై ఏర్పడిన గుంతలను ప్యాచ్ వర్క్ చేసి పూడ్చించాలని,స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.డివిజన్‌లో పేరుకు పోతున్న చెత్త కుప్పలను తొలగించాలని,బాలాజీ దాబా ఎదుట,ప్రకాశంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో పొంగుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.స్పందించిన డీసీ వీలైనంత వేగంగా పనులు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు రమేష్ తెలియజేసారు.డీసీని కల్సిన వారిలో రమేష్ తో పాటు పద్మారెడ్డి,ఎరుకల సురేష్,దర్గకరుణాకర్,కొండా కిరణ్,చినబాబు శాంతికుమార్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

విద్యార్థికి ట్రోఫీ అందిస్తున్న మైనంపల్లి

అల్వాల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:

మైనంపల్లి సోషల్ సర్వీసెస్ పేద విద్యార్థులకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మైనంపల్లి ఘనంగా సన్మానించారు. పేద విద్యార్థులకు ఎంఎస్ఎస్ఎ సంపూర్ణ సహకారాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తోట గోపాల్ రెడ్డి, తోట లక్ష్మీకాంత్ రెడ్డి, ప్రేమ్ కుమార్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతను కాపాడే కార్మికులను సన్మానించిన మర్రి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి.

బేగంపేట ఏప్రిల్ 22,ప్రభాతవార్త : ప్రతి రోజు వీధులను శుభ్రం చేస్తూ పారిశుద్యాన్ని కాపాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్న పారిశుధ్య కార్మికులు నిజమైన దేవుళ్లని బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవారెడ్డి అన్నారు.డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలలో భాగంగా బీజేపీ పార్టీ అధిష్టానం వారం రోజుల పాటు సమాజంలో పరిశుభ్రతను కాపాడే ప్రథమ శ్రేణి కార్మికులను సన్మానించాలని సూచించిన నేపథ్యంలో బుధవారం బేగంపేట మోతీలాల్ నెహ్రూనగర్ పార్క్‌లో పలువురు జీహెచ్ఎం సీ కార్మికులను బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవారెడ్డి సన్మానించి వారికి కానుకలు అందజేసారు.ఈ కార్యక్రమంలో బేగంపేట డివిజన్ అధ్యక్షులు యం.మహేష్‌కుమార్ ముదిరాజ్, మహిళా మోర్చా నాయకురాలు సంధ్యాలక్ష్మి,డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబూరావు,వెంకటేష్ యాదవ్,సంతోష్,ప్రమోద్, లోహిత్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఫిక్సడ్‌టర్మ్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : మొగుళ్ళ రాజిరెడ్డి

కమిషనర్ దివ్యకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో గత 20 ఏళ్ళుగా పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఫిక్సడ్ టర్మ్ (ఎఫ్.టి.ఈ) ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేసారు. హైదరాబాద్, ఖైరతాబాద్‌లోని పంచాయత్ రాజ్ రురల్ డెవలప్మెంట్ కార్యాలయంలో బుధవారం ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్‌ల నేతృత్వంలో తెలంగాణ ఫీల్డ్ అసిస్టెంట్స్ అగ్రికల్చర్ వర్కర్స్ యూనియన్ (ఐ.ఎన్.టి.యు.సి) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లుగిరి రవి, ప్రధాన కార్యదర్శులు కంకల సిద్దిరాజు, చల్ల వెంకటేశ్వర్లు, నాయకులూ పరశురామ్ తదితరులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పంచాయత్ రాజ్ రురల్ డెవలప్మెంట్ కమీషనర్ దివ్యకు వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ లను ఫిక్సడ్ టర్మ్ (ఎఫ్.టి.ఈ) ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టో ఇచ్చిన హామీతోపాటు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దినసరి అనసూయ యూనియన్ ప్రతినిధులతో గత జులై నెలలో జరిగిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఏ.పి.ఓ, ఈసీ, టి.ఏ.సి.ఓ ఉద్యోగుల మాదిరిగానే ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా ఎఫ్.టి.ఈలుగా గుర్తించి కనీస వేతనం రూ.25,000 ఇస్తూ మండల స్థాయిలో బదిలీలు చేయాలని కోరారు. ఎఫ్.ఏ.హెచ్.ఆర్‌ను సవరించి హెల్త్ కార్డులు, విధినిర్వహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు 15 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, రిటైర్ అయిన వారికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో గత 20 ఏళ్ళ నుండి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మానిఫెస్టోలో పొందుపరచిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దినసరి అనసూయ తక్షణమే స్పందించి మానవతా దృకల్పథంతో పరిష్కరించి, వారికీ న్యాయం చేయాలనీ విజ్ఞప్తి చేసారు.

విద్యాపునాదులు బలంగా ఉన్నప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాధ్యం : మంత్రి శ్రీధర్ బాబు

సభలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

చిక్కడపల్లి ఏప్రిల్ 22 (ప్రభాతవార్త) :

సమాజంలో విద్యా పునాది బలంగా ఉన్నప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి డి. శ్రీధర్ బాబు చేతులమీదుగా 5,050 మంది విద్యార్థులకు రూ. 4.55 కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లను ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ డైమండ్స్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో నాణ్యత పెరిగితేనే సమాజంలోని అన్ని వర్గాలకు సమానమైన అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ముఖ్యంగా సాంకేతిక విద్యను సామాన్యులకు చేరువ చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్వాహక సంస్థ ఆపరేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆషర్ ఓ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ రూ. 200 కోట్ల సీఎస్ఆర్ నిధులను కేటాయించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 33,000 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు. సిరాజ్ పి.కె, హైదరాబాద్ జోన్, జోనల్ హెడ్ షరీజ్ కె, ఇతర సీనియర్ ప్రతినిధులు, ప్రముఖులు, విద్యా రంగ నిపుణులు పాల్గొన్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్లాం..

సమ్మెలో శ్రీనివాస్,వాసు,దేవ్,మోహన్ తదితరులు

కార్వాన్,ఏప్రిల్ 22(ప్రభాతవార్త)

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన 32 హామీలను తక్షణమే అమలు చేయాలని మెహిదీపట్నం డిపో సీనియర్ నాయకులూ తాటికొండ శ్రీనివాస్, ఎస్.వాసు దేవ్,ఏ.సి.మోహన్‌లు డిమాండ్ చేచేస్తున్నామని అన్నారు.డిపో వద్ద భద్రత పర్యవేక్షి స్తున్న పోలీస్ ఇన్స్పెక్టర్ మల్లేష్ సిబంది.ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ..తమ 32 డిమాండ్లు కొత్తవేం కావని,పాతవేనని, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.మెహిదీపట్నం డిపో లో 119 బస్సులు ఉన్నాయని,అందులో 4 బస్‌లు అద్దె ప్రాతిపదికన ఉన్నవి నడుస్తున్నాయని,సుమారు 700 మంది కార్మికులు మెహిదీపట్నం డిపో సమ్మెలో భాగస్వాములై నారని పేర్కొన్నారు.ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు.సమ్మెలో భాగంగా డిపో వద్ద కార్మికులు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ సమ్మెలో సత్తయ్య,దినేష్, ఐ.పాండు, సురేష్, కోమట్ రెడ్డి,సి.ఎస్.రెడ్డి,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

: మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న మాజీ కార్పొరేటర్

అల్వాల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: అల్వాల్ డివిజన్ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కోరారు. బుధవారం జలమండలి అధికారిణిని ఆమె కార్యా లయంలో శాంతి శ్రీనివాస్ రెడ్డి కలిశారు. లక్ష్మీనగర్, ఇందిరానగర్, భీమ్‌రావు నగర్, ఎంఇఎస్ కాలనీ, ప్రశాంత్ నగర్, వెంకటరావు పేట్, స్టేషన్ బస్తీలకు సంబంధించి మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటుకు గతంలో అనుమతులు మంజూరై పనులు చేపట్టిన విధానాన్ని ఉన్నతాధికారిణికి శాంతి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

అర్షణపల్లి కృష్ణారావు అపరకర్మ కార్యక్రమం

- నివాళులర్పించిన న్యాయ మూర్తులు



అర్షణపల్లి కృష్ణారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

కూకట్‌పల్లిలోని రాంకీ విల్లాస్‌లో బుధవారం దివంగత అర్షణపల్లి కృష్ణారావు అపరకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ప్రముఖ న్యాయ మూర్తులతో పాటు పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్, సీనియర్ పాత్రికేయులు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు తదితరులు దివంగత అర్షణపల్లి కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి : ఆర్టీసి జెఎసి

బేగంపేట ఏప్రిల్ 22,ప్రభాతవార్త

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ నాయకులు బుధవారం సికింద్రాబాద్ రాణిగంజ్ ఆర్టీసీ డిపోవద్ద భారీ నిరసన చేపట్టారు.ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న వారిని ప్రభుత్వంలో విలీనం చేయాలని,పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను మంజూరు చేయాలని ,2017 పీఆర్సీ బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేసారు.కార్మిక సంఘాలను పునరుద్దరించాలని,ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయా లని, అద్దె బస్సులతో డిపోల పరిధి తగ్గిపోతుందని,ఆవేదన వ్యక్తం చేసారు.మొత్తం 32 డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని,వెంటనే చర్యలు జరిపి పరిష్కరించాలన్నారు.లేకుంటే ఆందోళనలను ఉదృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంప్

చార్మినార్,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియం ఆధ్వర్యంలో మే నెల 18 నుంచి 30వ తేదీ వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు మ్యూజియం కీపర్ డాక్టర్ ఆర్.బి.నాయక్ తెలిపారు.8 నుంచి12 సంవత్సరాలు జూనియర్ గ్రూపుగా,13 నుంచి 16 సంవత్సరాలు వయస్సుగల విద్యార్థులను సీనియర్ గ్రూపుగా విభజించి,అనుభవజ్ఞులైన అధ్యాపకులతో యోగ,ఆర్ట్ లివింగ్,లెక్చర్స్ ఆన్ ఇండియన్ ఆర్ట్,హెరిటేజ్ అవేర్‌నెస్,డ్రాయింగ్,పెయింటింగ్,ఆర్ట్ అండ్ క్రాఫ్ట్,ఎస్‌యుపిడబ్ల్యు తదితర అంశాలపై సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌లో శిక్షణఇవ్వనున్నామని ఆయన తెలియజేశారు. సమ్మర్ ఆర్ట్‌లో పాల్గొనదలచే అభ్యర్థులు మ్యూజియం కౌంటర్‌లో ధరఖాస్తులు పొంద వచ్చునని ఏప్రిల్ నెల 22 నుంచి మే నెల 10వ తేదీ లోగా పూర్తి చేసిన ధరఖాస్తులను అంద జేయాలని ఆయన తెలిపారు.మే నెల 11వ తేదీన ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తామని,1500 రూపాయలు అభ్యర్థులుచెల్లించ వలసి ఉంటుందని మ్యూజియం క్యూరేటర్ డాక్టర్.ఆర్.బి.నాయక్ వెల్లడించారు.

ప్రజల సంక్షేమమే తమకు ముఖ్యం

- ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

బబ్బుగూడ నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

యూసుఫ్‌గూడ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తాము ఊరుకునే ప్రసక్తే లేదని వారి సౌకర్యం కోసం పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం మోతీనగర్ ప్రాంతంలోని బబ్బుగూడ ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ నుంచి బబ్బుగూడ నాలాలోకి ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇటీవల ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ నుంచి బబ్బుగూడ వరకు వర్షపు నీటి పైప్‌లైన్ పనులు చేపడుతుండటంతో స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అందుకు ఆయన స్పందించి క్షేత్రస్థాయిలో సంబందిత అధికారులతో కలిసి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు పైప్‌లైన్ ద్వారా కేవలం వర్షపు నీటిని మాత్రమే వదలాలని పరిశ్రమకు సంబంధించిన ఎలాంటి రసాయన వ్యర్థాలు వదలి నాలా పొడవున్న స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని అన్నారు. ప్రజల సంక్షేమం ఆరోగ్యం తమకు ముఖ్యమని అధికారులను తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, అంబటి శ్రీనివాస్, తిరుపతి, మోహన్‌రెడ్డి, సత్యనారా యణరావు, రవిందర్‌రెడ్డి, ధర్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మారణాయుధాలతో సంచరిస్తున్న పాత నేరస్థులు అరెస్ట్

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : మారణాయులతో సంచరిస్తున్న ముగ్గురు పాత నేరస్థులను బుధవారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21వ తేదిన ఉదయం 7 గంటల సమయంలో స్వరూప్‌నగర్ విటి కమాన్ వద్ద పాత నేరస్థులు మారణాయులు కలిగి ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఎస్ఐ ఇద్దయ్య ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని అనుమానాస్పదస్థితిలో సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పాత నేరస్థులు దాసరి సురేందర్ అలియాస్ సూర్య మునీర్, ఆదిత్య ఠాకూర్ సింగ్, తనయ్ అలియాస్ కన్నాగా తేలింది. వారి వద్ద ఉన్న బ్యాగ్ లో ఒక రివాల్వర్, ఎయిర్ గన్, ఆరు రౌండ్లు, ఒక గొడ్డలి, ఒక కత్తి, ఐరన్ రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమ్మవారికి పూజలు జరుపుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన ఐడీహెచ్ కాలనీలోని పార్థివాడలో అడివి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ నెల20వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి విగ్రహం చోరీకి గురికాగా, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిందితులను పట్టుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. దీంతో గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని పట్టుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకొని ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. అమ్మవారి విగ్రహాన్ని యథాస్థానంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మంగళవారం ప్రతిష్టించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడగా ఆలయం మరమ్మతులు చేపట్టాలని కోరగా, వీలైనంత త్వరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి నమ్మకాలు, విశ్వాసాలు వారికి ఉంటాయని వాటిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆలయాలలో చోరీలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఏ రోజు కూడా లేని తాగునీరు, విద్యుత్ సమస్య కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై అవగాహన లేదని, ప్రతిపక్ష పార్టీలపై బూతులు మాట్లాడటం, అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుతో విసిగిపోయారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్యే వెంట పద్మారావునగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, డివిజన్ నాయకులు ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, మహేందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కొత్తూరు వెంకట్, ప్రేమ్, అరుణ్ గౌడ్, గజ్జల శ్రీనివాస్, నిమ్మ నాగలక్ష్మి, కాలనీ వాసులు అమ్మురాజ్, కామరాజ్, సిద్దు, శ్రీను తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి : కోనేరు రామసుందరి

నార్సింగిలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ధరిత్రి దినోత్సవం సందర్భంగా సీడ్‌బాల్ తయారు చేసిన విద్యార్థినుల దృశ్యం.

నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని లయన్స్‌క్లబ్ జూబ్లీహిల్స్ అధ్యక్షురాలు లయన్ కోనేరు రామ సుందరి పేర్కొన్నారు. మంగళవారం నార్సింగిలోని గురుకుల పాఠశాలలో జూబ్లీహిల్స్‌కు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధుల బృందం "ధరిత్రి దినం"ను నిర్వహించారు. విద్యార్థుల చేత సీడ్‌బాల్‌ను తయారు చేయించారు. ఈ సందర్భంగా రామ సుందరి మాట్లాడుతూ సకల జీవరాశుల పుట్టుక, మనుగడకు పుడమియే కారణమన్నారు. ఏ జీవరాశి మనుగడ సాగించాలన్నా భూమిపైనే ఆధారపడుతున్నాయన్నారు. ఇతర జీవరాశులన్నీ ప్రకృతి సిద్దంగా జీవనం సాగిస్తుంటే ఒక్క మనిషి మాత్రం తన విలాసవంతమైన జీవనం కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తూ, భూమి, నీరు, గాలి, అంతరిక్షంలను కలుషితం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటేటా పెరుగుతున్న కాలుష్యం, తరుగుతున్న అడవుల వలన భూ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రకృతి సిద్దంగా జీవనం సాగించేందుకు కృషి చేయాలని, వాతావరణ కాలుష్యంను తగ్గించుకునేందుకు మనుషులందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డ్రాయింగ్, వక్తృత్వం, వాదోపవాద పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పద్మావతి, రిందాదేవి, నాగేశ్వరి, శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం అహర్నిశలు పాటుపడతాం : విష్ణువర్ధన్‌రెడ్డి

గండిపేట్‌లోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిస్తున్న నార్సింగి సర్కిల్ బిఆర్ఎస్ నాయకులు

నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :

నిరంతరం నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం పరితపించిన ప్రజానాయకుడు ఇంద్రారెడ్డి ఆశయ సాధనకు అహర్నిషలు పాటు పడుతామని నార్సింగి సర్కిల్ బిఆర్ఎస్ సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గండిపేటలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ప్రజల నాయకుడని, నిరంతరం ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు కృషి చేసేవాడని గుర్తు చేశారు. నేడు రంగారెడ్డి జిల్లాలో అన్ని పార్టీల్లో ఇంద్రారెడ్డి అనుచరులు ఎమ్మెల్యేలుగా, జడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్పోరేటర్లు, కౌన్సిలర్లుగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముక్తార్, ప్రశాంత్ యాదవ్, అశోక్, గణేష్, శ్రీకాంత్‌రెడ్డి, రవి యాదవ్, చిరంజీవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులు వైఖరి మారాలి : కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

అక్రమ నిర్మాణాల పేరుతో గాజులరామారం సర్కిల్ అధికారులవైఖరితో న్యూ వల్లభాయ్‌పటేల్‌నగర్, అంబేద్కర్‌నగర్‌వాసులను తీవ్రభయాందోళనకు గురిచేయడం ఏమిటని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ప్రశ్నించారు. బుధవారం గాజులరామారం సర్కిల్ వల్లభాయ్‌పటేల్‌నగర్, అంబేద్కర్‌నగర్ వాసులతో కలిసి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్ కుమార్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా వల్లభాయ్ పటేల్‌నగర్, అంబేద్కర్‌నగర్ వాసులు ఎదుర్కొంటున్న అక్రమ ఇళ్ల నిర్మాణాలు అంటూ మున్సిపల్ సిబ్బంది 30ఏళ్లనుండి ఇళ్లునిర్మించుకుని ఉన్నప్రజలను ఆందోళనకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. జరిమానాలను విధిస్తున్నతీరుపై ఆమెదృష్టికి తీసుకువెళ్లారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆరు మున్సిపల్ సర్కిళ్లలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై వినతిపత్రాలను కమిషనర్ సుజనకు అందజేశారు. కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్, చౌదరిగారి బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగంపాండు ముదిరాజ్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, మోటే శ్రీనివాస్ యాదవ్, ఆరువ ఏర్వ వెంకట్‌సాయికిరణ్, గోపాల్‌రెడ్డి, గుమస్తా మధుసూధన్, వల్లభాయ్‌పటేల్‌నగర్ సక్షేమసంఘ అధ్యక్షులు రామిరెడ్డి, వి.రెడ్డి, కృష్ణ,రాము, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాణిక్యరెడ్డిలతోపాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈవిషయమై గాజురామారం సర్కిల్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో చర్చించి తగునిర్ణయం తీసుకుని న్యాయం చేస్తాని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన హామీఇచ్చారు.

ఖర్గే ప్రధాని మోడీని విమర్శించడం మానుకోవాలి

అత్తాపూర్ ఏప్రిల్ 22,ప్రభాతవార్త :

మల్లిఖార్జున ఖర్గే ప్రధాని నరేంద్రమోడీని విమర్శించడం మానుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని పలువురు బిజెపి నేతలు హెచ్చరించారు.ప్రధాని నరేంద్ర మోడీపై మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండస్తూ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో కటెదాన్ సర్కిల్ వద్ద మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ...దేశాన్ని ప్రధాని నరేంద్రమోడీ అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేని కాంగ్రెస్ నేతలు అనుచిత వ్యాఖ్యలకు తెగబడతున్నారని వాపోయారు.వెంటనే మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని ప్రధానికి క్షమాపణాలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, జిల్లా ఐటీ ఇంచార్జ్ వెంకట్రమణ గుప్తా , రావులు భాస్కర్, బొమ్మ రాజు నర్సింహా,నవర మురళీధర్ రెడ్డి,వై నర్సు రెడ్డి , గూడూరి అంజి, కొండాల్, జే ప్రేమ్ గణేష్ , వేణు , శ్రీనివాస్ మరియుకార్యకర్తలు పాల్గొని నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

కారు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని దొంగ మృతి

మైలార్‌దేవ్‌పల్లి,ఏప్రిల్ 22 ప్రభాతవార్త : దొంగతనం చేయటానికి ప్రయత్నించిన గుర్తు తెలియని ఓ దొంగ తప్పించుకుని రోడ్డు దాటుతున్న సమయంలో కారు ఢీ కొట్టడంలో మృతి చెందిన బుధవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం......గుర్తు తెలియని దొంగ (30) బుధవారం బృందావన్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న భవనం వద్ద ఉన్న మాలిష్ చేసే మిషన్‌ను దొంగ తనం చేయటానికిప్రయత్నించాడు.ఇది గమనించిన భవనం యజమాని గుర్తు తెలియని దొంగను మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తున్నాడు.మార్గమధ్యలో ప్రభుత్వ పాఠశాల వద్ద భవనం యజయాని ఫోన్లో మాట్లాడుతున్నాడు.ఇది గమనించిన గుర్తు తెలియని దొంగ వాహనం నుంచి దిగి పారిపోవటానికి ప్రయత్నించాడు. రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని దొంగను వేగంగా వచ్చిన కారు వచ్చి ఢీ కొట్టింది.ఈ సంఘటనలో గుర్తు తెలియని దొంగ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.ఈ కేసును ఎస్ఐ పైడి నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడుతున్న ముగ్గురు అరెస్ట్

కొంపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

నిజాంపేట్ రాత్రి వేళల్లో చోరీకి పాల్పడుతూ వాహనాలను దొంగలిస్తున్న ఓ వ్యక్తి, ఇద్దరు మైనర్ బాలురును బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు ఎల్లమ్మ బండకు చెందిన అజిత్ సింగ్ (20)ను జ్యూడీషియల్ రిమాండ్‌కి తరలించి, మైనర్ బాలురను పర్యవేక్షణ గృహమునకు అప్పగించారు. దొంగలించిన సొత్తు హుండా యాక్టివా వాహనం, ఒక ఆటోను పోలీసులు సీజ్ చేశారు. నిందితుడిపై గతంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్లో రెండు కేసులు, జగద్గిరిగుట్టలో ఒక కేసు, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదు అయి ఉన్నాయి.

భర్త మృతిని తట్టుకోలేక భార్య ఆత్మహత్య

నార్సింగి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :

భర్త మృతిని తట్టుకోలేక భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం నార్సింగి గ్రామంకు చెందిన దేవరపల్లి శైలజ(26) హౌస్‌కీపింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఇటీవల ఆమె భర్త మృతి చెందాడు. ఆర్థిక పరిస్థితి అంతకంతకు దిగజారిపోయింది. ఈ నేపథ్యంలో ఆమె మనస్థాపం చెంది ఈ నెల 21.వ,తేదీన సాయంత్రం ఏడున్నర గంటల ప్రాంతంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పక్కింటి వారు గమనించి వెంటనే మృతురాలి సోదరుడు శివకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

PUBLIC NOTICE

General public are hereby informed that our client Sri. Yadavelly Aravind, S/o. Y.Venkatesham, Age:49 years Occ: Business, Resident of H.No.2-2-1225/78, Prashanth Nagar, New Nallkunta, Hyderabad-500 044 has entered into an agreement for purchase of the all that the open plot bearing plot No.484/1, admeasuring 125 Sq. Yds & plot No.484/2, admeasuring 25 Sq. Yds. total admeasuring 150 sq. Yds in SY.Nos. 1 to 40,282 to 368,369(P). 370 to 373,374(P), 375 to 387,395 to 401,454,456 to 459, 505(P).510 to 564 Situated at Uppal Bhagath Village, under GHMC, Uppal Circle. Uppal Mandal, Medchal-Malkajgiri District from its lawful owner Smt.Sambu Jayamma, W/o. Sri. Sambu Pandaiah and has paid substantial part sale consideration also.

In the event of anybody having any claim or interest in the above said property or any objections for the transaction, shall approach the undersigned along with all the original documents substantiating the claim or objection within 7 days from this date thereafter no claims or objections will be entertained and our client will proceed for completion of the registration formalities.

Sd/- D.PREM KUMAR
ADVOCATE
12-11-226, WARISGUDA,
SECUNDERABAD-61
CELL: 98482 94276

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

సంక్షిప్త నిట్ నెం. 03/SE (M)/Sec-bad Zone/GHMC/2026-27 తేది: 22.04.2026

క్ర.సం.1. నిట్ నం. పైన పేర్కొన్నది. పనుల సంఖ్య: 02 పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో) రూ. 225.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: బిడ్ దాఖలుకు ప్రారంభ తేది మరియు సమయం : తేది: 23.04.2026 మ.1.00గం. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం : తేది: 29.04.2026 మ.1.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: SE, సికింద్రాబాద్ జోన్, GHMC, 9963550657. తదుపరి వివరాలు https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, GHMC.

DIPR.NO. 1228-PP/CL/ADVT/1/2026-27 తేది: 22.04.2026

వినియోగదారులకు మెరుగైన సేవలు : నంగునూరి చంద్రశేఖర్

తిరుమల బ్యాంకు చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నంగునూరి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న బ్యాంకు డైరెక్టర్లు తదితరులు

మలక్ పేట ఏప్రిల్ 22, ప్రభాతవార్త: వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామని తిరుమల బ్యాంక్ చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మలక్ పేట లోని తిరుమల బ్యాంక్ లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గా నంగునూరి చంద్రశేఖర్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. బ్యాంకు చైర్మెన్ గా ఐదు సంవత్సరాల పాటు ఆయన కొనసాగుతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో నమ్మకం, విశ్వసనీయత ఎంతో ముఖ్యమైనవని, వినియోదారులకు బాధ్యతతో అత్యుత్తమసేవలు అందిస్తున్నామని తెలిపారు. కృషి, పట్టుదల, దీక్ష ఉంటేనే విజయం సాధిస్తామని తెలిపారు. తిరుమల బ్యాంకు ను ఏర్పాటు చేసి 28 సంవత్సరాలు అవుతోందని పలు బ్రాంచ్ లను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. తాము అందిస్తున్న సేవలను గుర్తించి అధిక సంఖ్యలో వినియోగదారులు తమ బ్యాంకులో డిపాజిట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకింగ్ సేవలు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. సైబర్ నేరాలు అధికమవుతున్నాయని బ్యాంకులు, వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాజ్ కుమార్ మకీజా, డైరెక్టర్లు వీ. కనకదుర్గ, అబ్దుల్ అలీ ఉస్మాని, ఆలే దేవదాస్, ఎ రవికుమార్, ఎన్. వెంకటేష్, చేగి రెడ్డి ప్రభాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, శైలేంద్ర సింఫ్వీ, సతీష్ చంద్ర మెంజిలతోపాటు బ్యాంక్ మేనేజర్ రవిశంకర్, పలువురు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌తోనే అభివృద్ధి : జగన్

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భేటీ అయిన అక్బర్ బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచికంటి జగన్

మలక్ పేట, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: బిఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని అక్బర్ బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మంచికంటి జగన్ పేర్కొన్నారు. మలక్ పేట నుంచి నాయకులు, కార్యకర్తల తో కలిసి జగన్ బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఆయనతో భేటీ అయి మలక్ పేట నియోజకవర్గంలో చేపడుతున్న కార్య క్రమాల గురించి వివరించడంతోపాటు పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. రానున్న గ్రేటర్ ఎన్నికలలో బిఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంపాపేటలో మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం

మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

సైదాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్రమోడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను చంపాపేట చౌరస్తాలో బిజెపి నాయకులు దగ్ధం చేశారు. బిజెపి నాయకులు సిల్వేరి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం ప్రధాని నరేంద్రమోడి పాలనను మెచ్చుకుంటుంటే ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ప్రధానిని టెర్రరిస్టు అని అనడం దుర్మార్గమని అన్నారు. టెర్రరిస్టులకు వత్తాసు పలికే పార్టీగా కాంగ్రెస్ పార్టీ మారిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, టింగ్లికార్ రాజేష్, పాశం శ్రీశైలం, సందీప్‌రెడ్డి, భానుక రమేష్, దశరథ్‌గౌడ్, భరత్, జగదీశ్వర్‌రెడ్డి, సుమిత్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి నీచమైన రాజకీయాలు : బిజెపి నాయకులు

సైదాబాద్‌లో మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

సైదాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్రమోడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను సైదాబాద్‌లో బిజెపి నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి మచ్చలేని పాలనకు దేశ ప్రజలంతా బ్రహ్మరథం పడుతుంటే తట్టుకోలేకే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నీచమైన విమర్శలకు దిగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ తీరును మార్చుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.కార్యక్రమంలో నిరంజన్ యాదవ్, కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జంగం మధుకర్‌రెడ్డి, ఉగాది మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు : జెడ్‌సి రాధిక గుప్తా

దోమల నివారణకు భగాయత్‌లో డ్రోన్‌తో ఫాగింగ్ చేపట్టిన మున్సిపల్ అధికారులు దృశ్యం.

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : ఉప్పల్ జోనల్ పరిధిలో దోమల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ జోన్ పరిధిలోని భగాయత్ ప్రాంతంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. మూసీ నాలా పరిసర ప్రాంతాల్లో దోమల పెరుగుదలను పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రోన్ సహాయంతో ప్రతిరోజు ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్‌ను నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. దోమలను నిర్మూలించేందుకు ఏసిఎం స్ప్రేను భగాయత్ ప్రాంతంలో ప్రతి రోజు చేపట్టాలని కోరారు. మూసీ పరివాహక ప్రాంతంగా ఉన్న భగాయత్ రెండు ఫేజ్‌లలో మందులు చల్లాలని కోరారు. రోడ్లపై చెత్తాచెదారం ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉప్పల శ్రీనివాస్ గుప్త

ఉప్పల శ్రీనివాస్ గుప్తాను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉప్పల శ్రీనివాస్ గుప్త నియమితులయ్యారు. ఈ సందర్భంగా క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన అసోసియేషన్ ప్రెసిడెంట్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ లకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అసోసియేషన్ సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణలో బ్యాడ్మింటన్ క్రీడను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను గుర్తించి వారికి సరైన మార్గదర్శకత్వం, సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. క్రీడా మౌలిక సదుపాయాల పెంపు, శిక్షణా శిబిరాల ఏర్పాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తానని పేర్కొన్నారు.ఇకపై తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, క్రీడా రంగంలో రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచేందుకు తన వంతు కృషి చేస్తానని ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు స్పష్టం చేశారు.

దిల్‌షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో నిలిచిపోయిన బస్సులు

-పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన ఆర్టీసీ జెఏసి నాయకులు, డ్రైవర్లు, కండక్టర్లు

-దిల్ షుక్ నగర్ డిపోలో భారీగా మోహరించిన పోలీసులు

దిల్ షుక్ నగర్ డిపో వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు, సిబ్బంది తదితరులు

మలక్ పేట, ఏప్రిల్ 22,ప్రభాతవార్త: ఆర్టీసీ జేఏసీ చర్చలు విఫలమవడంతో దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపోలో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. కొద్దిపాటి బస్సులు మాత్రమే సర్వీసులోకి వెళ్లగా, ఎక్కువ భాగం బస్సులు డిపోలోనే నిలిచిపోయాయి.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిపో ముందు పోలీసులూ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో వద్ద యూనియన్ నాయకులు చేరుకున్నారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల నిరసన ఉద్రిక్తంగా మారింది.వందలాది మంది కార్మికులు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, ఆర్టీసీ జేఏసీ నాయకులు వెంకటయ్య గౌడ్, నిరంజన్, ఆనంద్, మోహన్ లు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని జెఏసి నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఆర్టీసీని తెలంగాణ ప్రభుత్వంలో విలీనం చేయాలని అదే విధంగా రెండు పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యం యూని యన్లను పునరుద్ధరించాలని, ప్రభుత్వం మొండి వైఖరితో పోకుండా ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు జీవితాలను కాపాడాలని జెఏసి నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేదంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా దిల్ సుఖ్ నగర్ సిటీ డిపో ఎదుట కార్మికులు శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేయడానికి టెంట్ ఏర్పాటుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏం లేక ఎండలోనే కూర్చుని ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులు జెఏసి నేతలు శాంతియుతంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా దిల్ సుఖ్ నగర్ లో ఉన్న జిల్లా డిపో నుంచి కూడా బస్సులన్నీ డిపోకే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ మహా నగరంలో కీలకమైన దిల్ సుఖ్ నగర్ ప్రాంతంలో ఆర్టీసీ సమ్మె కారణంగా సామాన్యులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

మల్కాజ్గిరి అభివృద్ధి పథంలో మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ప్రశంసనీయం : చామకూర మల్లారెడ్డి

నేరేడ్ మెట్ ఏప్రిల్ 22,ప్రభాతవార్త : మల్కాజ్గిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న గౌరవ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ప్రశంసనీయం అని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్ల రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా ప్రతిబింబిస్తూ రూపొందించిన కరదీపిక ను ఘనంగా మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతుల మిదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ఏ.కే. ముర్గేష్ మరియు న్యాయవాది ఆర్. మణిరత్నం ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కాలనీల అభివృద్ధి, రహదారుల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా విస్తరణ, పేదల సంక్షేమానికి సంబంధించిన పలు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి అవసరాలను తెలుసుకొని వెంటనే స్పందించడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు.కరదీపికలో మల్కాజ్గిరి నియోజకవర్గంలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులు, పరిష్కరించిన సమస్యలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు వివరంగా పొందుపరిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇది ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా, ప్రజాప్రతినిధుల పనితీరుకు అద్దం పట్టే పత్రంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న మల్కాజ్గిరి నియోజకవర్గం, మరింత పురోగతిని సాధించాలని అయన కోరారు.

తాగునీటి సమస్యపై తక్షణ చర్యలు తీసుకున్న మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

నేరేడ్ మెట్,ఏప్రిల్ 22,ప్రభాతవార్త : వినాయక నగర్ డివిజన్ పరిధిలోని లాల్వానీ నగర్ అసోసియేషన్ కాలనీ నివాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తక్షణ స్పందనతో పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం స్థానికులకు ఊరట కలిగించింది.కాలనీలో బోరు నీరు తీవ్రంగా కలుషితమవుతున్న నేపథ్యంలో, డ్రైనేజీ నీరు బోర్లలోకి చేరి తాగునీటి నాణ్యత పూర్తిగా దెబ్బతింటోందని నివాసులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండటంతో అందుబాటులో ఉన్న బోరు నీరే వినియోగించాల్సి వస్తున్నా, అదే నీరు కాలుష్యానికి గురవ్వడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యపై వెంటనే స్పందించిన క్యానం రాజ్యలక్ష్మి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జనరల్ మేనేజర్ సునీల్‌కు సమస్య తీవ్రతను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.దీనికి స్పందించిన అధికారులు కాలనీలో పర్యటించి శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టారు. డ్రైనేజీ నీరు బోర్లలోకి చేరకుండా నివారణ చర్యలు తీసుకోవడంతో పాటు, తాగునీటి నాణ్యత మెరుగుపరిచేందుకు సాంకేతిక చర్యలు అమలు చేయనున్నట్లు తెలిపారు.మాజీ కార్పొరేటర్ చొరవతో సమస్య పరిష్కార దిశగా చర్యలు ప్రారంభమవడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే స్పందించినందుకు క్యానం రాజ్యలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సునీల్, టీ నవీన్ (వాటర్ వర్క్స్ మేనేజర్), కార్యకర్తలు ఓం ప్రకాశ్, సాయి సురేష్, మహేష్, కాలనీ వాసులు ప్రేమ్, తాహిర్, కరుణాకర్, గోపాలు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఇంద్రారెడ్డిది ప్రత్యేకమైన గుర్తింపు : సబితారెడ్డి

స్వర్గీయ పట్లోళ్ళ ఇంద్రారెడ్డి స్మారక ఘాట్ వద్ద పుష్పాంజలితో నివాళులర్పిస్తున్న రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి: చిత్రంలో సబితా ఇంద్రారెడ్డి, కౌశిక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, ఇంద్రారెడ్డి అభిమానులు ఉన్నారు.

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: రాజకీయాల్లో తన కంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపుతో ప్రజలకు సేవలందించిన గొప్ప నాయకుడు స్వర్గీయ పట్లోళ్ళ ఇంద్రారెడ్డి అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వివిధ శాఖలకు మంత్రిగా పని చేసి అశేష జనాదరణ పొందిన స్వర్గీయ ఇంద్రారెడ్డి 26 వర్ధంతి బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన సతీమణి సబితా ఇంద్రారెడ్డి, కుమారులు రాజేంద్ర నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జి, యువనేత పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డిలు, ఇతర కుటుంబ సభ్యులు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాల నుండి తరలివచ్చిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వారి స్వగ్రామం చేవెళ్ళ కౌకుంట్లలో ఇంద్రారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక వ్యవసాయ క్షేత్రంలోని ఇంద్రారెడ్డి స్మారక ఘాట్ వద్ద పుష్పాభిషేకం చేసి నివాళులర్పించిన అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో కొనసాగినా వినమ్రతను వదలని ఇంద్రారెడ్డి పేదలు, రైతులు, బడుగు, బలహీనవర్గాలతో పాటు అన్ని వర్గాల వారికి సేవలందించి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌళిక సదుపాయాలను కల్పించడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. చిరస్మరణీయుడైన ఆయన ఆశయ సాధన కోసం తాను, తన కుటుంబం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. కాగా ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా సబితారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మహేశ్వరం నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు కౌకుంట్లకు తరలివచ్చి స్వర్గీయ ఇంద్రారెడ్డికి నివాళులర్పించారు.

నేటి నుండి వాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డులో ధాతునగర్ క్రాస్ రోడ్డు వద్ద నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయం పక్కనే భవ్యమైన నిర్మాణం పూర్తి చేసుకున్న శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నేటి (గురువారం) నుండి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభంకానున్నాయి. సబితా ఇంద్రారెడ్డి సహకారంతో క్యాంపు కార్యాలయ భవనం పక్కనే లభించిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి ఆనుకొని ఉన్న స్థలంలో ఆర్యవైశ్యులు భవ్యమైన వాసవి మాత దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించారు. దాదాపు రెండు, మూడు సంవత్సరాలుగా శ్రమకోర్చి ఆలయనిర్మాణ నిపుణులతో నిర్మించిన ఈ వాసవి మాత దేవాలయంలో ప్రతిష్టాపనోత్సవాలను తలపెట్టారు. 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా 26వ తేదీ ఆదివారం ఉదయం అమ్మవారి జయంతిని పురస్కరించుకొని దశమి దినాన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి షడాధార ప్రతిష్టాపనను తలపెట్టారు. అదే విధంగా ఆలయంలో వాసవి అమ్మవారితో పాటు గణపతి, స్ఫటికలింగ సహిత సరస్వతి, ధ్వజ స్థంభ ప్రతిష్టాపనలను కూడా నిర్వహించనున్నారు. ఆలయంలోని మూల విరాట్టు అయిన శ్రీ వాసవి మాత విగ్రహాన్ని అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి అరుణ్ యోగిరాజు తయారు చేయడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. అయితే ఈ ప్రతిష్టాపనోత్సవాలను శృంగేరి పండితులు, యాగ బ్రహ్మశ్రీ విరివింటి ఫణి శశాంక్ శర్మ, ఉభయ భారతి విద్యాపీఠం వ్యవస్థాపకుడు వ్యాసోజ్జల గోపికృష్ణ శర్మ చేతుల మీదుగా నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే వాసవి మాత విగ్రహ ప్రతిష్టాపనోత్సవ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని చైర్మన్ తెరటిపల్లి శ్రీనివాస్‌గుప్త, అధ్యక్షుడు పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తి గుప్త, యిరువెంటి సురేష్‌గుప్త, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్తులు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపాలన

పనులను పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ప్రజా సమస్యల త్వరగా పరిష్కారం కావాలని అధ్యాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే.శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా బుధవారం చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం కాలనీలో రోడ్డు పక్కన ఉన్న వ్యర్థ, భవనాలను కూల్చివేసిన వ్యర్థాలను సరూర్‌నగర్ సర్కిల్ సిబ్బంది తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కాలనీలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సిబంది కోట్ల నరేష్, మహేందర్, రాజు,కాంగ్రెస్ నాయకులు వెంకటేష్‌చారీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సింహ వాహన సేవ

సింహ వాహన సేవతో ఊరేగుతున్న స్వామి వారు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: భక్తుల కోలాహల మధ్య స్వామివారి సింహ వాహన సేవలో ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్కే పురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో జరుగుతున్న 30వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారిని సింహ వాహన సేవలో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా సుప్రభాత సేవ, బాలభోగ మంగళాశాసనము, తీర్థప్రసాద గోష్ఠి, వరాహ ఇష్టి, యాగశాలలో మూలమంత్ర హవనములు, చతుస్థానార్చన, యాగశాలలో నిత్య పూర్ణాహుతి, ఇష్టియాగశాలలో పూర్ణాహుతి, భగవత్ రామానుజాచార్య జయంతి సందర్భంగా అర్చన, తనియ విన్నపము, చందన గోష్ఠి, బలిహరణ, మంగళాశాసనము, శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రపారాయణ, యాగశాలలో చతుస్థానార్చన, నిత్యహోమము, రథోత్సవము, ప్రణయ కలహోత్సవము మంగళాశాసనము తదితర కార్యక్రమాలను వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా దేవాలయం మాడవీధులలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులకు ఫలహారము, అన్నప్రసాదము, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, మ్యాడం సుధాకర్‌గుప్తా, బంధం దామోదర్, దాచేపల్లి శ్రీనివాస్, బోయిని శ్రీనివాస్, చిలుక ఉపేందర్‌రెడ్డి, కొక్కొండ చంద్రశేఖర్, మాలే శ్రీనివాస్‌గుప్తా, సత్యనారాయణ, మాలే శ్రవణ్‌కుమార్‌గుప్తా పాల్గొన్నారు.

ఆర్టీసి కార్మికుల సమ్మె..ఉద్రిక్తత

బస్సులు నడిపేందుకు అధికారుల ప్రయత్నం.. అడ్డుకున్న కార్మికులు

హయత్ నగర్ డిపో ఎదుట బైటాయించిన కార్మికులు

హయత్ నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : హయత్ నగర్ 1, 2 డిపోల ఆర్టీసీ కార్మికులు బుధవారం కొనసాగించిన సమ్మె ఉద్రిక్తతకు దారి తీసింది. కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు హయత్ నగర్ లోని 1, 2 డిపోలలో ఉదయం ఐదు గంటల నుంచి 217 బస్సులు కదలలేదు. కార్మికులు డిపో ఎదుట రోడ్డుపై బైఠాయించి తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.జేఏసీ నాయకులు కత్తుల యాదయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాబు మాజీ యూనియన్ నాయకులు రాజిరెడ్డిలు కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ సంఘాల యూనియన్లు ఏర్పాటు చేయాలని , పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి శాంతియుతంగా కార్మికులు ఆందోళన చేస్తుండగా 10 గంటల సమయంలో పోలీసు బందోబస్తుతో బస్సులను నడిపేందుకు అధికారులు యత్నించారు. బస్సులు బయటకు వస్తున్న క్రమంలో కార్మికులు అడ్డుకున్నారు. దీంతో కార్మికులకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసు బందోబస్తు మధ్య సుమారు 30 బస్సులను బయటకి పంపించారు. అడ్డుకున్న సుమారు 14 మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. పోలీసులు ఎంత నిర్బంధించిన ప్రభుత్వం దిగి వచ్చే వరకు బస్సులను అడ్డుకుంటామని కార్మికులు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డిలు పరిస్థితిని సమీక్షించారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో న్యాయం గెలిచింది : ప్రభాకర్‌రెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో మాజీ సిఎం కెసిఆర్‌కు న్యాయస్థానం నిజమైన తీర్పు ఇచ్చిందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పసుల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదన్నారు. ప్రాజెక్ట్ విషయంలో బిఆర్ఎస్ పార్టీ ఎటువంటి అవకతవకలు చేయలేదని, కుంగిన ఫిల్లర్లు రిపేరు చేయకుండా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా విజయ దుర్గమాత దేవాలయం వార్షికోత్సవం

అన్నదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత తదితరులు

సైదాబాద్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: సైదాబాద్‌లోని శ్రీ విజయ దుర్గమాత దేవాలయం 21వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నంఅన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలత, సంగీత, సునీల్‌రెడ్డి, అల్లి శ్రవణ్, రవి శంకర్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి

అరుణాసురేందర్‌యాదవులను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అరుణోదయ కాలనీ నూతన కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్ యాదవ్ నివాసంలో ఆమెను కలిసిన కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న పలు ముఖ్య సమస్యలను కమిటీ సభ్యులు అరుణ దృష్టికి తీసుకువెళ్లారు. రోడ్ల దుస్థితి, డ్రైనేజ్ వ్యవస్థలో లోపాలు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, చెత్త నిర్వహణ వంటి అంశాలపై వివరించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో శ్రద్ధ వహించాలని కోరారు. అందుకు స్పందించిన అరుణ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని అన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

హబ్సిగూడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాలేరు జైనవీన్ తదితరులు

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం హబ్సిగూడలో బిఆర్ఎస్ సీనియర్ నేత కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్యలు అధికమవుతాయని, అలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ చల్లని త్రాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, ప్రయాణికులు, వృద్ధులు, రోడ్డుపై వెళ్లే ప్రజలకు ఈ చలివేంద్రం ఉపశమనాన్ని కలిగిస్తుందని అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుభ్రమైన నీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేరు సురేందర్, కాలేరు ప్రణతి, బిఆర్ఎస్ సీనియర్ నేతలు పసుల ప్రభాకర్ రెడ్డి, చెంచల లక్ష్మీనారాయణ, రజిత రెడ్డి,కంచి మనోహర్, సంజయ్ జెన్, లింగ నాయక్, రవి నాయక్, కిషోర్ నాయక్, మహ్మద్ రహమాన్, కైసర్, నాని, రవి ప్రసాద్, మహేందర్, సందీప్, ఫైసల్ బాబు, మహేందర్ నాయక్, శృతి, పలువురు బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

మల్లిఖార్జున ఖర్గే క్షమాపణలు చెప్పాలి

జిల్లెలగూడ స్వాగత్‌గ్రాండ్ చౌరస్తాలో మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తులసి ముఖేష్ ముదిరాజ్ తదితరులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త: ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్రమోడిపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని మీర్‌పేట్ సెక్టార్-2 బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ప్రధానిని ఉగ్రవాది అని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఖర్గే దిష్టిబొమ్మను బుధవారం సాయంత్రం ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖర్గే దిష్టిబొమ్మకు నిప్పుపెట్టి దహనం చేసి కాంగ్రెస్‌కు, మల్లిఖార్జున ఖర్గేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ముఖేష్ మాట్లాడుతూ ఖర్గే వ్యాఖ్యలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ప్రజలు ఆయన చేసిన చేసిన వ్యాఖ్యలను క్షమించరని తెలిపారు. ఖర్గే వెంటనే తన తప్పును తెలుసుకొని మోడీకి క్షమాపణలు చెప్పాలని ముఖేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పాలమూరి విజయలక్ష్మి రాజు, ఇంద్రావత్ రవినాయక్, మాజీ ఎంపిటిసి మేకల రవీంద ర్‌రెడ్డి, నాయకులు సిద్దాల శ్రీనివాస్, కసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, గాజుల మధు, కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, ఆవుల సత్తయ్య, సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డిపలువురు పాల్గొన్నారు.

చైల్డ్ వికాస్ పౌండేషన్ ఆధ్వర్యంలో పాదరక్షలు పంపిణీ



చైల్డ్ వికాస్ పౌండేషన్ ఆధ్వర్యంలో పాదరక్షలు, టోపీలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు దృశ్యం.

ఉప్పల్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : చైల్డ్ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవిలో ఇబ్బంది పడుతున్న పేదలకు పాదరక్షలు, టోపీలు ఉచిత పంపిణీ చేశారు. పౌండేషన్ నిర్వహకులు రమేష్ దండు ఆధ్వర్యంలో సివిఎఫ్ ట్రస్టీ పుష్పారెడ్డి మార్గదర్శకత్వంలో పలువురికి అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకుంటున్న తరుణంలో పాదరక్షలు లేని వారికి వాటిని అందిస్తున్నామని తెలిపారు. రోడ్డుపై మండుటెండ నుండి ప్రజలను కాపాడటానికి ప్రత్యేక కార్యచరణ తీసుకుంటున్నామని తెలిపారు. దినసరి కూలీలు, ఇతరులకు వీటిని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అలివేలు, ఎస్.మమత, లక్ష్మి ఇతర సభ్యులు పాల్గొన్నారు.